మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 5-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 276 Issue: 276

05 ఏప్రిల్ 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:11 సూర్యాస్తమయం - సా. 6:26 తిథి తదియ మ. 12:01 వరకు తరువాత చవితి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం విశాఖ రా. 12:03౦ వరకు తరువాత అనురాధ యోగం వజ్ర మ. 2:39 వరకు కరణం విష్టి మ. 12:01 వరకు బవ రా. 1:05౦ వరకు వర్జ్యం తె. 4:35 నుండి ఉ. 6:22 వరకు దుర్ముహూర్తం సా. 4:48 నుండి సా. 5:37 వరకు రాహుకాలం సా. 4:54 నుండి సా. 6:26 వరకు యమగండం మ. 12:19 నుండి మ. 1:50 వరకు గుళికకాలం మ. 3:22 నుండి సా. 4:54 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:35 నుండి తె. 5:23 వరకు అమృత ఘడియలు మ. 2:23 నుండి సా. 4:09 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:54 నుండి మ. 12:43 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana

# పరాయి... మోజు

భార్యకు బదులు
వేరే మహిళకు సుఖం
కాలం మారింది బ్రో..

భర్తకు బదులు వేరే
పురుషుడికి పక్క
కాలం మారింది బ్రో..

పెళ్లి కాకముందే
సహజీవనం
కాలం మారింది బ్రో..

భర్తను చంపైనా
ప్రియుడితో పోవాలి
కాలం మారింది బ్రో..

పెళ్లైనా వేరొకరితో
ఎంజాయ్ చేయాలి
కాలం మారింది బ్రో..

ముసలోడైనా
పడుచు పిల్లతో..
చిన్న పోరడైనా
ఆంటీలతో..
కాలం మారింది బ్రో..

## ..విచ్చలవిడి స్వతంత్రం..

- పెళ్లైనా వేరొకరితో సంబంధాలు
- అడ్డుగా ఉన్నారని దారుణ హత్యలు
- దేశంలో పెరుగుతున్న సహజీవనం
- తప్పుకాదంటున్న న్యాయస్థానాలు
- నీరుగారుతున్న నైతికత, బాంధవ్యాలు





భారతదేశంలో
ఏటా సుమారు
275
మంది భర్తలు
వారి భార్యల
చేతిలో హత్యకు
గురవుతున్నారు

సండే స్పెషల్ స్టోరీ
Sunday Special Story

### సహజీవన జంటలకు కుటుంబ హోదా..

2026 ఏప్రిల్ 1 నుండి ప్రారంభం కానున్న 16వ జనగణనలో సహజీవనం చేస్తున్న జంటలకు కూడా కుటుంబ హోదా కల్పిస్తాం. ఒకే ఇంట్లో చాలా కాలంగా కలిసి నివసిస్తూ, తమ బంధం స్థిరమైనదని భావించే సహజీవన జంటలను వివాహిత జంటలుగానే పరిగణిస్తాం.
**- కేంద్ర ప్రభుత్వం**

### పెళ్లైనా వేరొకరితో సహజీవనం తప్పు కాదు..

పెళ్లయినప్పటికీ, ఇద్దరు వ్యక్తులు పరస్పర సమ్మతితో సహజీవనంలో ఉండటం నేరం కాదు. సామాజిక నైతికత వేరు, చట్టం వేరు. ఇష్టపూర్వకమైన ఈ బంధం వ్యక్తిగత స్వేచ్ఛ కిందకు వస్తుంది, చట్టపరంగా తప్పు కాదు.
**- అలహాబాద్ హైకోర్టు తీర్పు**

### దేశంలో పెరుగుతున్న వివాహేతర సంబంధాలు..

వివాహేతర సంబంధాల్లో దేశంలోనే బెంగళూరు తొలిస్థానంలో, హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. గత రెండేళ్లలో ఈ యాప్‌లో మహిళల రిజిస్ట్రేషన్లు 148 శాతం పెరిగాయి. వివాహ బంధంలో ఒంటరితనం, భావోద్వేగ పరమైన అశ్రద్ధ వల్ల చాలామంది మహిళలు బయట సంబంధాలను కోరుకుంటున్నారు. ఆర్థికంగా స్వతంత్రులుగా ఉన్న మహిళలు తమ వ్యక్తిగత సంతోషం కోసం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు. **- గ్లీడెన్ డేటింగ్ యాప్ సర్వే**

(ఈవార్తలు స్పెషల్ డెస్క్)

ఈ మూడు వార్తలు.. వేర్వేరు అంశాలు, వేర్వేరు సందర్భాలు.. కానీ, లోతుగా పరిశీలిస్తే అంతా ఒకే ఉమ్మడి అంశం. ఒకటి భావో ద్వేగానికి చెందినది, మరొకటి మానసిక పరిస్థితికి చెందినవి, ఇంకొకటి శారీరక పరిస్థితికి చెందినది. అంతా కలిసి.. శారీరక, మానసిక భావోద్వేగమే. అయితే, సమాజానికి వెన్నెముకగా, నైతికతకు చిరు నామాగా నిలిచిన భారతీయ కుటుంబ వ్యవస్థ నేడు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. నూరేళ్ల పంట గా భావించే వివాహ బంధం, నేడు క్షణికావేశాలకు, వివాహేతర వ్యామోహాలకు బలైపోతోంది. అన్యోన్యం గా ఉండాల్సిన దంపతులు ఒకరి ప్రాణాలను మరొ కరు తీసుకోవడమే కాకుండా, కన్నబిడ్డలను అనా థలను చేస్తున్న తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,093 |
| వెండి (గ్రాము): | రూ.255 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,915 |

## విశ్వవాణి



కవాసకి కంపెనీ ఈ మధ్యే కార్లియో అనే రోబో గుర్రాన్ని ఆవిష్కరించింది. అచ్చం నిజమైన జంతువులా నాలుగు కాళ్లతో నడిచే ఈ రోబో.. హైడ్రోజన్‌తో నడుస్తుంది. దానికి చక్రాలు ఉండవు. కొండ ప్రాంతాలు ఎక్కేవాళ్ల కోసం కవాసకి ప్రత్యేకంగా దీన్ని అభివృద్ధి చేసింది.




# అమెరికా జెట్స్ తుస్!

### ఏ-10 యుద్ధవిమానాన్ని కూల్చేసిన ఇరాన్
### రెండ్రోజుల్లోనే మూడు విమనాలు నేలమట్టం
### అగ్రరాజ్యానికి వణుకు పుట్టిస్తున్న టెహ్రాన్

అమెరికాకు చెందిన ఎఫ్-35, ఎఫ్-15ఈ యుద్ధ విమానాలను ద కూల్చేసిన ఇరాన్ సైన్యం.. తాజాగా, ఏ-10 యుద్ధ విమానాన్నీ కూల్చివేసినట్టు ప్రకటించింది. ప్రపంచంలోనే అత్యంత కీలకమైన సముద్ర మార్గమైన హుర్ముజ్ జలసంధి సమీపంలో ఈ ఘటన జరిగినట్టు తెలిపింది. ఈ వ్యూహాత్మక జలమార్గం దక్షిణ భాగంలో విమానాన్ని లక్ష్యంగా చేసుకున్నారని ఇరాన్ మీడియా, తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ నివేదించాయి.

టెహ్రాన్: అమెరికాకు చెందిన అమెరికన్ ఏ-10 యుద్ధ విమానాన్ని ఇరాన్ కూల్చేసింది. శుక్రవారం స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్ దగ్గర అమెరికన్ ఏ-10 యుద్ధ విమానాన్ని ఇరాన్ కూల్చేసిందని తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. ఆర్మీ పబ్లిక్ రిలేషన్ టీమ్ తెలిపిన వివరాల మేరకు.. వ్యూహాత్మక జలమార్గం చుట్టుపక్కల, దక్షిణ దిశలో ఉన్న సముద్ర జలాల్లో సంచరిస్తున్న ఏ-10 విమానాన్ని ఇరాన్ సైన్యం లక్ష్యంగా చేసుకుని పేల్చేసింది. అయితే, తరువాయి 2 వ పేజీలో...



# కౌంట్‌డౌన్.. 48 గంటలే!

### ప్రళయానికి టైం అవుతోంది... ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు

ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. మరో 48 గంటల సమయమే మిగిలి ఉందని చెప్పారు. ఒప్పందం చేసుకోవాలని లేదా హోర్ముజ్ తెరవాలని గడువు విధించామన్నారు. సమయం మించిపోతోందంటూ ట్రూత్‌లో పోస్ట్ చేశారు. ప్రళయానికి మరో 48 గంటలే మిగిలి ఉందని ట్రంప్ చెప్పారు.

వాషింగ్టన్: 'ఇరాన్‌కు నేను 10 రోజుల గడువు ఇచ్చిన విషయం గుర్తుందా? ఒప్పందం చేసుకోవాలి లేదా హోర్ముజ్ జలసంధిని తెరవాలి. సమయం ముగియనుంది. ఇంకా 48 గంటల తర్వాత అన్నీ విధ్వంసం అవుతాయి' అని డొనాల్డ్ ట్రంప్ ట్రూత్‌లో పేర్కొన్నారు. కాగా, అమెరికా సైనిక విమానాలకు జరిగిన నష్టం ఇష్యూ ఇరాన్‌తో దౌత్య చర్చలపై ప్రభావం చూపదని ట్రంప్ పేర్కొన్నారు. యుద్ధ విమానాల కూల్చివేత ఘటన చర్చలను దెబ్బతీస్తుందనే వాదనలను ట్రంప్ తిరస్కరించారు. మరోవైపు, ఇజ్రాయెల్ సైన్యం స్పందిస్తూ.. తరువాయి 2 వ పేజీలో...



# తిరుమల తరహాలో బాసర

### రూ.225 కోట్లతో మాస్టర్ ప్లాన్.. ఈనెల 6న పనులు ప్రారంభం

బాసర/హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఈవార్తలు): బాసరలోని పవిత్ర జ్ఞాన సరస్వతి దేవస్థానాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. తాజాగా ఆలయ అభివృద్ధి కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ.. ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ అభివృద్ధి జరగాలని చెప్పారు. నిర్మల్ జిల్లా గోదావరి నది ఒడ్డున ఉన్న శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయాన్ని ప్రభుత్వం రూ.225 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తోందన్నారు. అందుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను అధికారులు వివరించగా ముఖ్యమంత్రి తరువాయి 2 వ పేజీలో...



# సింగరేణి కార్మికులకు గుడ్ న్యూస్

### సహజ మరణానికి రూ.10 లక్షల ఉచిత బీమా.. హర్షం వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాలు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఈవార్తలు): సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కార్మికుల కార్మికుల సంక్షేమం కోసం మరో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే విధుల్లో ఉండి ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కు టుంబాలకు రూ.1 కోటి ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించిన సంస్థ.. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి సహజ మరణం పొందిన కార్మికులకు కూడా ఆర్థిక భరోసా కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో సింగరేణి యాజమాన్యం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఏప్రిల్ 1 నుంచే పథకం ప్రారంభం కాగా.. సింగరేణిలో తరువాయి 2 వ పేజీలో...



# కేసీఆర్ క్యాంప్ ఆఫీస్‌పై దాడి

### కార్యాలయంలో ఫర్నిచర్ ధ్వంసం
### గోడకు సీఎం రేవంత్ ఫొటో

గజ్వేల్/సిద్దిపేట, ఏప్రిల్ 4 (ఈవార్తలు): భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు క్యాంపు కార్యాలయంపై శనివారం దాడి జరిగింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన శ్రేణులు ఈ దాడికి పాల్పడ్డాయి. సిద్దిపేట డీసీసీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి నేతృత్వంలో తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

5.4.2026

మేషం: చిన్ననాటి మిత్రులతో సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వ్యాపారాలలో ఆర్థిక పురోగతి సాధిస్తారు. గృహమున కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. వృత్తి ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు.

వృషభం: ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి. ప్రారంభించిన పనులు మందకొడిగా సాగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. కుటుంబ సభ్యులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. సహోద్యోగులతో మాట పట్టింపులుంటాయి.

మిధునం: చేపట్టిన పనులలో అవరోధాలు కలుగుతాయి. ఇంటా బయట శ్రమాధిక్యత పెరుగుతుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. నిరుద్యోగుల ప్రయత్నలోపం లేకపోయినా ఫలితం ఉండదు. వ్యాపార వ్యవహారాలు మందగిస్తాయి.

కర్కాటకం: ముఖ్యమైన వ్యవహారాలలో సన్నిహితుల సహాయం లభిస్తుంది. కుటుంబ సభ్యులతో సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు. ఉద్యోగమున మీ పనితీరుతో అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు.

సింహం: సన్నిహితులతో మాటపట్టింపులు ఉంటాయి. ఆర్థికంగా అవసరానికి ధనం లభించక ఇబ్బందిపడతారు. వ్యాపారాలు నత్తనడకగా సాగుతాయి.నూతన ఋణ ప్రయత్నాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలు మరింత బాధిస్తాయి. వృత్తి ఉద్యోగాల్లో అదనపు బాధ్యతల వలన విశ్రాంతి ఉండదు.

కన్య: భూ సంభందిత క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. కుటుంబ సభ్యుల నుండి ఆకస్మిక ధనలాభం పొందుతారు. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు నూతన అవకాశములు లభిస్తాయి.

తుల: దీర్ఘకాలిక ఋణ ఒత్తిడి పెరుగుతుంది. చిన్ననాటి మిత్రులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపార వ్యవహారాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి. ఇంటా బయట కొందరి ప్రవర్తన ఆశ్చర్యం కలిగిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో ప్రయత్నాలు కలిసిరావు.

వృశ్చికం: సమాజంలో పెద్దలతో పరిచయాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో కీలక సమాచారం సేకరిస్తారు. గృహమునకు చిన్ననాటి మిత్రుల రాక ఆనందం కలిగిస్తుంది. సోదరులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఉద్యోగాలలో మరింత అనుకూల పరిస్థితులుంటాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి.

ధనస్సు: చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. నిరుద్యోగ యత్నాలు వేగవంతం చేస్తారు. ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. ఆప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వృత్తి వ్యాపారాలు లాభాల బాటపడతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతల నుండి ఉపశమనం పొందుతారు.

మకరం: వృధా ఖర్చులు పెరుగుతాయి. ఆరోగ్య విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. ముఖ్యమైన పనులు వాయిదా పడుతాయి. జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్ర దర్శనం చేసుకుంటారు. వృత్తి వ్యాపారాలలో ఊహించని సమస్యలు ఎదురవుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహ పరుస్తాయి.

కుంభం: చేపట్టిన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆకస్మికంగా కొన్ని నిర్ణయాలు మార్చుకుంటారు. వ్యాపారమున నూతన పెట్టుబడుల విషయంలో పునరాలోచన చెయ్యడం మంచిది. దూరపు బంధువులతో స్వల్ప విభేదాలు ఉంటాయి. విద్యార్థులు పోటీపరీక్షలలో మరింత కష్టపడాలి.

మీనం: వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. సోదరుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. ఆర్థిక వాతావరణం అనుకూలిస్తుంది. నూతన వస్తు వాహన లాభాలు పొందుతారు.

# పరాయి..మోజు

**మొదటి పేజీ తరువాయి**

తీరు సభ్య సమాజాన్ని తలదించుకు నేలా చేస్తోంది. గత దశాబ్ద కాలంలో సాంకేతికత పెరిగిన వేగంతోనే నైతిక విలువల పతనం కూడా వేగవంతమైంది. సోషల్ మీడియా వాడకం, డేటింగ్ యాప్‌ల లభ్యత పరాయి వ్యక్తులతో పరిచయాలను సులభతరం చేశాయి. ఇది బాహ్య కారణం మాత్రమే. అంతర్గతంగా దంపతుల మధ్య ఉండాల్సిన సంభాషణ లోపించడం, ఒకరినొకరు గౌరవించుకోక పోవడం, విలాసవంతమైనజీవితంపై మితిమీరిన వ్యామోహం ఈ వివాహేతర సంబంధాలకు బీజం వేస్తున్నాయి. 'ప్రేమ' అనే ముసుగులో సాగే ఈ అక్రమ సంబంధాలు చివరకు 'నేరం' అనే గమ్యానికి చేరుతున్నాయి.

ఒకప్పుడు వివాహేతర సంబంధం బయటపడితే అవమానంగా భావించేవారు. కానీ నేడు, ఆ అడ్డంకిని తొలగించుకోవడానికి ఏకంగా 'హత్య' అనే దారిని ఎంచుకుంటున్నారు. గత ఏడాది కాలంగా తెలుగు రాష్ట్రాల్లో జరిగిన ఘటనలను పరిశీలిస్తే, అత్యంత కిరాతకమైన పద్ధతుల్లో (మృతదేహాలను ముక్కలు చేయడం, సజీవ దహనం, కిరాయి హంతకులతో చంపించడం) హత్యలు జరుగుతున్నాయి. ఇది మనిషిలో పెరుగుతున్న నేర ప్రవృత్తికి, పశ్చాత్తాపం లేని మనస్తత్వానికి నిదర్శనం. నేరస్తులు తమ స్వార్థం కోసం జీవిత భాగస్వామిని శత్రువుగా చూడటం సామాజిక విచ్ఛిన్నానికి దారితీస్తోంది. ఈ రక్తపాతంలో అసలైన బాధితులు అమాయకపు పిల్లలు. తండ్రి ప్రాణాలు కోల్పోవడం, తల్లి జైలుకు వెళ్లడం లేదా తల్లిదండ్రులిద్దరూ నేరాల్లో భాగస్వాములవ్వడం వల్ల పిల్లల భవిష్యత్తు అంధకారమవుతోంది. సమాజంలో వారిపై పడే ముద్ర వారిని మానసిక రోగులుగా లేదా తిరిగి నేరస్తులుగా మార్చే ప్రమాదం ఉంది. వివాహ బంధం కేవలం ఇద్దరు వ్యక్తుల కలయికే కాదు, అది రెండు కుటుంబాల నమ్మకం. ఆ నమ్మకం వమ్ము అయినప్పుడు సమాజపు పునాదులు కదులుతాయి. ఇప్పుడు జరుగుతున్నది అదే.

### సంస్కృతే చట్టం కాదా?

వివాహ చట్టాలకు ఆయా సంస్కృతులే ఆధారం. అందుకే ఒక్కో మతానికి ఒక్కో రకమైన వివాహ చట్టం ఉంది. కానీ, నేడు సంస్కృతిని చట్టం మించిపోయింది. చట్టం తన అధికారాలను వినియోగించుకొని, కొన్ని విలక్షణమైన తీర్పులు ఇస్తూ భారతీయ సంస్కృతిని పాడు చేస్తోంది. నేటి పరిస్థితులకు అనుగుణంగా తీర్పులు ఇవ్వాల్సి వస్తుందని కోర్టులు వివరణ ఇచ్చుకున్నా, సంస్కృతి నుంచి చట్టం పుట్టిందన్న మూలాన్ని ఎందుకు మర్చిపోతున్నాయన్నది మాత్రం న్యాయాధీశులకే తెలియాలి.

### చట్టం గొప్పదా.. నైతికతా?

చట్టాలు కఠినంగా ఉండటం ఒక ఎత్తు అయితే, వ్యక్తిగత నైతికతను కాపాడుకోవడం మరో ఎత్తు. పాఠశాల స్థాయి నుంచే విలువలతో కూడిన విద్యను అందించాలి. వివాహానికి ముందు కౌన్సెలింగ్, దంపతుల మధ్య సమస్యలు వచ్చినప్పుడు పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవడం లేదా చట్టబద్ధంగా విడిపోవడం వంటివి గౌరవప్రదమైన మార్గాలు. అంతే తప్ప, నేరమే పరిష్కారం అనుకోవడం ఆత్మహత్యాసదృశ్యం. కుటుంబ గౌరవం, నైతిక విలువలు పుస్తకాలకే పరిమితం కాకూడదు. బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణం మనందరి కర్తవ్యం. అక్రమ సంబంధాల మాయలో పడి ప్రాణాలను బలితీసుకోవడం ఆగిపోవాలి. పవిత్రమైన పెళ్లి బంధానికి మళ్లీ పాత వైభవం రావాలి. చట్టాలు ఎన్ని ఉన్నా, మనిషి తన నైతిక విలువలను కోల్పోయినప్పుడు నేరాలు ఆగవు. వివాహేతర సంబంధాల వల్ల కలిగే క్షణికానందం, జీవితకాలం జైలు శిక్షకు లేదా ప్రాణాలు కోల్పోవడానికి దారితీస్తుందని గుర్తించాలి. సమాజం, కుటుంబం మరియు వ్యక్తిగత గౌరవం పట్ల బాధ్యత కలిగి ఉండటమే ఈ నేరాల అదుపునకు ఏకైక మార్గం.

### శిక్షలు ఇలా..

వివాహేతర సంబంధాలు కేవలం నైతిక తప్పిదాలు మాత్రమే కాదు, అవి నేరాలకు దారితీసినప్పుడు చట్టం తన ఉక్కుపాదాన్ని మోపుతుంది. భారతదేశంలో మారుతున్న చట్టాలు, న్యాయస్థానాల తీర్పులు ఈ అంశంపై స్పష్టమైన దిశానిర్దేశం చేస్తున్నాయి. వివాహేతర సంబంధం కారణంగా జరిగే హత్యలు అత్యంత కిరాతకమైనవి. కొత్తగా అమలులోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత ప్రకారం.. హత్యకు పాల్పడిన వారికి మరణశిక్ష లేదా జీవితఖైదుతో పాటు జరిమానా విధిస్తారు(సెక్షన్ 103) 0. గతంలో ఐపీసీ 302 కింద ఉన్న ఈ నిబంధనలు ఇప్పుడు మరింత పటిష్టంగా అమలు చేస్తున్నారు. 2018లో సుప్రీంకోర్టు 'జోసెఫ్ షైన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో వ్యభిచారం నేరం కాదని తీర్పునిచ్చింది. అయితే, దీనిని విచ్చలవిడితనానికి లైసెన్స్‌గా భావించకూడదని స్పష్టం చేసింది. ఇటీవల ఢిల్లీ హైకోర్టు ఒక సంచలన తీర్పులో, భార్య లేదా భర్త వివాహేతర సంబంధం వల్ల ఎదుటి భాగస్వామికి కలిగిన మానసిక క్షోభకు గానూ, ఆ సంబంధంలో ఉన్న మూడో వ్యక్తి నుంచి నష్టపరిహారం వసూలు చేయవచ్చని పేర్కొంది. వివాహేతర సంబంధం పెట్టుకుని భాగస్వామిని మానసిక వేధింపులకు గురిచేయడం కూడా సెక్షన్ 498-ఏ (కుటుంబ హింస) పరిధిలోకి వస్తుంది. దీనివల్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అలాగే, ప్రియుడిని లేదా ప్రియురాలిని ప్రేరేపించి భాగస్వామిని చంపేలా కుట్ర పన్నితే, దానికి కూడా సమానమైన శిక్షలు ఉంటాయి. ఫ్యామిలీ కోర్టులలో ఏటా వేల సంఖ్యలో కేసులు పేరుకుపోతున్నాయి. తప్పుడు ఆరోపణలు చేయడం లేదా వివాహేతర సంబంధాల వల్ల విడాకులు కోరడం వల్ల న్యాయవ్యవస్థపై భారం పెరుగుతోంది. 'వివాహం అనేది ఒక పవిత్రమైన సామాజిక ఒప్పందం, దాన్ని వ్యక్తిగత స్వేచ్ఛ పేరుతో ఛిన్నాభిన్నం చేయడం సమాజానికి హానికరం' అని న్యాయమూర్తులు అభిప్రాయపడుతున్నారు.

### వివాహేతర నేరాలు ఇలా..

- నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో తాజా నివేదికలు, వివిధ పరిశోధనల ప్రకారం, కుటుంబ హింస, వివాహేతర సంబంధాల వల్ల జరిగే హత్యల సంఖ్య ఆందోళనకరంగా ఉంది.
- భారతదేశంలో ఏటా సుమారు 275 మంది భర్తలు వారి భార్యల చేతిలో హత్యకు గురవుతున్నారు. గత ఐదేళ్లలో (2020-2024) కేవలం ఐదు రాష్ట్రాల్లోనే (ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్) 785 మంది భర్తలు భార్యల చేతిలో బలయ్యారు.
- సగటున ఏడాదికి 225 మంది భార్యలు భర్తల చేతిలో హత్యకు గురవుతున్నారు.
- నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి 10 నిమిషాలకు ఒక మహిళ తన భాగస్వామి లేదా కుటుంబ సభ్యుల చేతిలో ప్రాణాలు కోల్పోతోంది.
- వివాహేతర సంబంధాలు, కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు, క్షణికావేశం ఈ హత్యలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి.



### సంచలనం సృష్టించిన కేసులు (2024-25)

#### తెలంగాణలో..

**గద్వాల-నంద్యాల వివాహేతర కుట్ర:** మే 2025లో పెళ్లయిన కేవలం నెల రోజులకే గద్వాలకు చెందిన తేజేశ్వర్ అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. అతని భార్య ఐశ్వర్య తన ప్రియుడు, తల్లి సహాయంతో ఈ హత్యకు ప్లాన్ చేసింది. ఆమె తన భర్త లైవ్ లొకేషన్ ని హంతకులతో పంచుకోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**హైదరాబాద్ మీర్‌పేట ఘటన:** అక్టోబర్ 2025లో మీర్‌పేటలో సంధ్య అనే మహిళ తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్త విజయ్ కుమార్‌ను ఐరన్ రాడ్‌తో కొట్టి చంపింది. అనంతరం మృతదేహాన్ని ఇంటి బయట పడేసి, అది ఒక ప్రమాదమని నమ్మించే ప్రయత్నం చేసింది.

**రంగారెడ్డి జిల్లా కందుకూరు హత్య:** ఏప్రిల్ 2025లో ప్రమీల అనే మహిళ తన ప్రియుడు కుమార్‌తో కలిసి భర్త ప్రవీణ్‌ను నిద్రలోనే గొంతు నులిమి హత్య చేసింది.

**అమీన్‌పూర్ బ్యాంక్ మేనేజర్ హత్య:** నవంబర్ 2025లో అమీన్‌పూర్‌లో బ్రహ్మయ్య అనే వ్యక్తి తన భార్య కృష్ణవేణిని (బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్) క్రికెట్ బ్యాట్‌తో కొట్టి చంపాడు. వీరిద్దరి మధ్య ఒకరిపై ఒకరికి ఉన్న వివాహేతర సంబంధాల అనుమానాలే ఈ ఘోరానికి కారణం.

**నల్లకుంట దారుణం:** డిసెంబర్ 2024లో హైదరాబాద్ నల్లకుంటలో వెంకటేశ్ అనే వ్యక్తి భార్యపై అనుమానంతో ఆమెను సజీవ దహనం చేశాడు.

#### ఆంధ్రప్రదేశ్‌లో..

**నెల్లూరు గండవరం జంట హత్యలు:** ఏప్రిల్ 2026లో నెల్లూరు జిల్లాలో జరిగిన జంట హత్యలు తీవ్ర కలకలం రేపాయి. వివాహేతర సంబంధమే ఈ హత్యలకు ప్రధాన కారణమని పోలీసులు నిర్ధారించి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు.

**నంద్యాల విల్సన్ హత్య:** మార్చి 2026లో నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన విల్సన్ అనే వ్యక్తిని అతని భార్య రాశి తన ప్రియుడితో కలిసి బెల్టుతో గొంతు బిగించి చంపింది. మృతదేహాన్ని కైప సమీపంలో పడేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది.

**విజయనగరం కెరటం హత్య:** ఆగస్టు 2025లో సాయి అనే యువకుడు.. తన అత్తతో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని బాబాయ్ కృష్ణను చంపి పాతిపెట్టాడు.

**శ్రీ సత్యసాయి జిల్లా చలపతి హత్య:** డిసెంబర్ 2025లో తన భార్యతో సంబంధం పెట్టుకున్నాడనే కోపంతో వెంకటరమణ అనే వ్యక్తి పుర్రా చలపతిని దారుణంగా హత్య చేశాడు.

#### ఇతర రాష్ట్రాల్లో..

**యూట్యూబర్ రవీనా రావు కేసు (హర్యానా):** రేవారికి చెందిన యూట్యూబర్ రవీనా రావు, తన ప్రియుడు సురేష్‌తో కలిసి భర్త ప్రవీణ్‌ను గొంతు నులిమి హత్య చేసింది. అనంతరం మృతదేహాన్ని బైక్‌పై తీసుకెళ్లి డ్రైనేజీలో పడేసింది. వివాహేతర సంబంధాన్ని భర్త పసిగట్టడమే ఈ హత్యకు దారితీసింది.

**రిటైర్డ్ సైనికుడి హత్య (కాన్పూర్):** మాయాదేవి అనే మహిళ తన ప్రియుడు అనిల్ యాదవ్‌తో కలిసి భర్త దేవేంద్ర కుమార్ (రిటైర్డ్ ఆర్మీ సోల్జర్)ను హత్య చేసి, మృతదేహాన్ని ఆరు ముక్కలుగా నరికి నది ఒడ్డున పడేసింది.

**పెళ్ళైన 15 రోజులకే హత్య (ఔరయ్యా):** ఉత్తరప్రదేశ్‌లోని ఔరయ్యాలో ప్రగతి యాదవ్ అనే యువతి, తన చిరకాల ప్రియుడు అనురాగ్‌తో కలిసి పెళ్లయిన కేవలం 15 రోజులకే భర్త దిలీప్ యాదవ్‌ను చంపేందుకు కుట్ర పన్నింది.

**మేఘాలయ హనీమూన్ మర్డర్:** మేఘాలయకు హనీమూన్‌కు వెళ్లిన సమయంలో సోనమ్ అనే మహిళ తన వివాహేతర సంబంధం కారణంగా భర్త రాజాని హత్య చేయించినట్లు పోలీసులు గుర్తించారు.

**కాన్పూర్ ధీరేంద్ర హత్య:** ధీరేంద్ర అనే వ్యక్తిని అతని భార్య రీనా తన మేనల్లుడు (మరియు ప్రియుడు) సత్యంతో కలిసి మంచం పలకతో కొట్టి చంపింది.

## తిరుమల తరహాలో బాసర

**మొదటి పేజీ తరువాయి**

పలు సూచనలు చేశారు. 6వ తేదీన ఈ ఆలయ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు.భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సువిశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. భక్తుల విశ్వాసాలు దెబ్బతినకుండా ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండాలని.. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తిరుపతి తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలకు తావు లేకుండా నిబంధనలు ఉండాలని చెప్పారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అటు.. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ సమగ్ర అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసింది.

ఇందులో భాగంగా తొలిదశలో రూ.351 కోట్లతో చేపట్టనున్న విస్తరణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల భూమిపూజ నిర్వహించారు. ఈ నిధుల్లో సింహభాగం అంటే రూ.180 కోట్లను ఆలయ విస్తరణ, భక్తులకు అవసరమైన అత్యాధునిక మౌలిక సదుపాయాల కల్పన కోసం కేటాయించారు. అలాగే రూ.96 కోట్లతో ఆలయ పరిసరాలను ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా తీర్చిదిద్దనున్నారు. గోదావరి నది ఒడ్డున భక్తుల సౌకర్యార్థం రూ.75 కోట్లతో స్నానఘట్టాలను అభివృద్ధి చేయనున్నారు. ఈ మొత్తం ప్రాజెక్టును మూడు దశల్లో రూ.586 కోట్ల అంచనా వ్యయంతో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2027లో రానున్న గోదావరి పుష్కరాల నాటికి మొదటి దశ పనులను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఆగమ శాస్త్ర నియమాలకు లోబడి రాబోయే 200 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. భక్తుల రద్దీని తట్టుకునేలా విశాలమైన క్యూలైన్లు, అన్నదాన సత్రాలు, పార్కింగ్ వసతులను కూడా ఈ ప్రణాళికలో చేర్చారు.

## కార్మికులకు గుడ్ న్యూస్

**మొదటి పేజీ తరువాయి**

పనిచేస్తున్న ప్రతి కార్మికుడు, అధికారికి సహజ మరణం సంభవిస్తే వారి కుటుంబానికి రూ.10 లక్షల ఉచిత బీమా సొమ్ము అందనుంది.ఈ చారిత్రాత్మక నిర్ణయం వెనుక సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, పర్సనల్ అండ్ ఫైనాన్స్ డైరెక్టర్ గౌతమ్ పోట్రుల ప్రత్యేక చొరవ ఉంది. గతంలో కేవలం ప్రమాదాలకే పరిమితమైన బీమా సౌకర్యాన్ని, అనారోగ్యం లేదా ఇతర కారణాలతో మరణించే కార్మికులకు కూడా వర్తింపజేయాలని యాజమాన్యం బ్యాంకును కోరింది. దీనికి సానుకూలంగా స్పందించిన యూనియన్ బ్యాంక్.. తమ బ్యాంకులో కార్పొరేట్ శాలరీ అకౌంట్ కలిగిన ప్రతి ఉద్యోగికి ఈ సౌకర్యం కల్పిస్తామని స్పష్టం చేసింది. సాధారణంగా ఏదైనా ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలో 10 లక్షల జీవిత బీమా తీసుకోవాలంటే వయసును బట్టి ఏటా కనీసం 5 వేల నుంచి రూ. 10 వేల వరకు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. కానీ, సింగరేణి యాజమాన్యం కుదుర్చుకున్న ఈ ఒప్పందం ప్రకారం.. కార్మికులు ఒక్క పైసా కూడా ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. కేవలం యూనియన్ బ్యాంకులో జీతం ఖాతా ఉంటే సరిపోతుంది. ఈ మొత్తం ప్రీమియం భారాన్ని బ్యాంకే భరిస్తుంది. ఇది కార్మికులపై ఎటువంటి ఆర్థిక భారం పడకుండా వారి కుటుంబాలకు పెద్ద మొత్తంలో రక్షణ కల్పిస్తుంది. సింగరేణిలో ప్రస్తుతం యూనియన్ బ్యాంక్‌తో పాటు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ వంటి మరికొన్ని బ్యాంకులు కూడా రూ.1 కోటి ప్రమాద బీమాను అమలు చేస్తున్నాయి. ఇప్పుడు యూనియన్ బ్యాంక్ సహజ మరణానికి కూడా బీమాను ప్రకటించడంతో.. మిగిలిన బ్యాంకులు కూడా ఇదే బాటలో నడిచేలా యాజమాన్యం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. త్వరలోనే అన్ని బ్యాంకు ఖాతాదారులైన కార్మికులకు ఈ ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయంపై కార్మిక సంఘాలు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కౌంట్‌డౌన్.. 48 గంటలే!

**మొదటి పేజీ తరువాయి**

ప్రళయానికి టైం అవుతోంది... ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు ఇరాన్ రాజధానిలో కీలక మౌలిక సదుపాయాలపై దాడులు కొనసాగుతున్నాయని పేర్కొంది. తమ వైమానిక దళం టెహ్రాన్‌లో బాలిస్టిక్, వైమానిక రక్షణ క్షిపణి నిల్వ కేంద్రాలపై దాడి చేసిందని చెప్పింది. అదే దాడుల్లో ఆయుధ తయారీ కేంద్రాలు, సైనిక పరిశోధన అభివృద్ధి సదుపాయాలు కూడా ఉన్నాయి అని తెలిపింది.

## కేసీఆర్ క్యాంప్ ఆఫీస్‌పై దాడి

**మొదటి పేజీ తరువాయి**

భారీ సంఖ్యలో గజ్వేల్‌కు తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు.. కేసీఆర్ క్యాంపు కార్యాలయంలోకి చొచ్చుకుని వెళ్లాయి. కార్యాలయంలోని ఫర్నిచర్ ధ్వంసం చేశాయి. దాడి సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు సీఎం రేవంత్ రెడ్డి ఫొటోను కేసీఆర్ కార్యాలయం గోడకు అతికించారు. అనంతరం జై కాంగ్రెస్.. గజ్వేల్ టైగర్ నర్సిరెడ్డి.. బీఆర్ఎస్, కేసీఆర్ డౌన్ డౌన్ అని నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని కాంగ్రెస్ శ్రేణులను అక్కడి నుంచి పంపించివేశారు.

## అమెరికా జెట్స్ తుస్!

**మొదటి పేజీ తరువాయి**

ఈ వార్తపై ఇరాన్ సైన్యం నుంచి ఎటువంటి ఖచ్చితమైన ప్రకటనలు రాలేదు. కాగా, ఏ-10 విమానాన్ని క్లోజ్ ఎయిర్ సపోర్ట్ మిషన్ల కోసం అమెరికా తయారు చేసుకుంది. ఇవి గ్రౌండ్ అటాక్ విమానాలు. సాయుధ వాహనాలు, శత్రు సైనికులపై దాడులకు ఏ-10 యుద్ధ విమానాలను వాడుతుంటారు. మరోవైపు, గల్ఫ్ దేశాలే లక్ష్యంగా ఇరాన్ భీకర దాడులు చేస్తోంది. గల్ఫ్ దేశాల ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులకు పాల్పడుతోంది. కువైట్‌లోని మినా అల్- అహ్మదీ చమురు శుద్ధి ఫ్యాక్టరీపై దాడి చేసింది. ఇరాన్ దాడులతో గల్ఫ్ దేశాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. అమెరికా నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు దొరక్కపోవటంతో గల్ఫ్ దేశాలు అల్లాడిపోతున్నాయి.

## పోలీస్ మామలు.. గ్రూప్‌లోకి చొరబడ్డారు!

గోదావరిఖని, ఏప్రిల్ 4 (ఈవార్తలు): పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల నుంచి తప్పించుకోవడానికి కొందరు యువకులు వేసిన ప్లాన్ బెడిసికొట్టింది. పోలీసుల కళ్లుగప్పేందుకు వారు ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూప్‌లోకి ఓ ట్రాఫిక్ ఎస్సై ఎంట్రీ ఇచ్చి వారికి దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు. గోదావరిఖని పట్టణంలో పోలీసులు ఎక్కడెక్కడ తనిఖీలు చేస్తున్నారో తెలుసుకునేందుకు కొందరు యువకులు 'పోలీస్ మామల స్క్వాడ్' పేరుతో వాట్సాప్ గ్రూప్‌ను సృష్టించారు. ఇందులో 1,024 మంది సభ్యులు ఉన్నారు. తనిఖీల సమాచారాన్ని గ్రూప్‌లో పంచుకుంటూ, ఆ దారుల్లో వెళ్లకుండా జాగ్రత్తపడేవారు. అయితే ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఓ యువకుడి ఫోన్‌ను పరిశీలించగా ఈ గ్రూప్ వ్యవహారం బయటపడింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్సై వెంటనే అప్రమత్తమయ్యారు. పట్టుబడిన యువకుడి ఫోన్ నుంచే ఆ గ్రూప్‌లోకి ప్రవేశించారు. ఎస్సై గ్రూప్‌లో చేరడంతో కంగారుపడిన సభ్యులు ఒక్కొక్కరిగా లెఫ్ట్ అవ్వడం మొదలుపెట్టారు. దీంతో ఆ ఎస్సై ఓ వీడియో సందేశాన్ని గ్రూప్‌లో పోస్ట్ చేశారు. "ఏం మామలూ.. బాగున్నారా? మీ ఫోన్ నంబర్లు అన్నీ నా దగ్గర సేవ్ అయి ఉన్నాయి. గ్రూప్ వీడినా లాభం లేదు. త్వరలోనే మీ అందరినీ పిలిపించి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇస్తాం" అంటూ ఆయన చేసిన హెచ్చరిక ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పోలీసు తనిఖీల నుంచి తప్పించుకునేందుకు ఇలాంటి గ్రూపులు నడపడం చట్టరీత్యా నేరమని, విధి నిర్వహణకు ఆటంకం కలిగించడమేనని అధికారులు హెచ్చరించారు. గ్రూప్ సభ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## లవర్ పెళ్లికి అంగీకరించలేదని..!

**రేడియో టవర్ ఎక్కి కడప యువకుడి హల్‌చల్**

ఎల్బీనగర్–హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఈవార్తలు): ప్రియురాలు పెళ్లికి అంగీకరించలేదని ఒక యువకుడు హైదరాబాద్‌లోని ఎల్బీనగర్, చింతలకుంట ప్రాంతంలో రేడియో టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. తాను ప్రేమించిన అమ్మాయి పెళ్లికి అంగీకరించడం లేదని, ఆమె లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. యువకుడిని రేడియో టవర్ మీది నుంచి కిందకు దించేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. జానీ అనే యువకుడు అక్కడి ప్రసార భారతి రేడియో టవర్ ఎక్కి డయల్ 100కు ఫోన్ చేశాడు. తనను ముఖ్యమంత్రితో మాట్లాడించాలని డిమాండ్ చేశాడు. ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తూ, పలు కారణాలు చెబుతున్నాడు. ఆటో గ్యాస్ కోసం ఇబ్బంది అవుతోందని, నిరుద్యోగం, ప్రియురాలు పెళ్లికి ఒప్పుకోలేదంటూ వివిధ కారణాలు చెప్పాడు. ఎట్టకేలకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అతనిని సురక్షితంగా కిందకు దించారు. జానీ ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా తుమ్మలపల్లి గ్రామానికి చెందినవాడు.

## కల్తీ మామిడి పండ్ల దందా

**హైదరాబాద్‌లో 200 కిలోలు సీజ్, వ్యాపారి అరెస్ట్**

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఈవార్తలు): వేసవి వచ్చిందంటే చాలు మామిడి పండ్ల సందడి మొదలవుతుంది. కానీ, ఇదే అదనుగా కొందరు వ్యాపారులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. హైదరాబాద్‌లో రసాయనాలతో కృత్రిమంగా పండించిన 200 కిలోల మామిడి పండ్లను ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులు కలిసి పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఒక పండ్ల వ్యాపారిని అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. కాయలను త్వరగా పండించి, ఎక్కువ లాభాలు పొందేందుకు 'ఇథిలీన్ రైపెనర్' వంటి రసాయనాలను అనుమతించిన మోతాదుకు మించి వాడుతున్నట్లు అధికారులు తమ తనిఖీల్లో గుర్తించారు. ఇలాంటి పద్ధతులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్యాల్షియం కార్బైడ్ లేదా ఇతర రసాయనాలతో పండించిన పండ్లను తినడం ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వీటి వల్ల గొంతు మంట, కడుపునొప్పి, వాంతులు వంటి తక్షణ సమస్యలతో పాటు, దీర్ఘకాలంలో క్యాన్సర్ బారిన పడే ప్రమాదం కూడా ఉందని చెప్పారు.

# రేవంత్ మౌనమేల?

### ప్రైవేట్ ఫీజుల దోపిడీపై స్పందనేది?.. విద్యాకమిషన్ ముసాయిదా బిల్లుపై ఎందుకీ కాలయాపన?

**కార్పొరేట్ విద్యాసంస్థలతో ప్రభుత్వానికి లాలూచీ ఏంటీ?.. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నిలదీత**

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఈవార్తలు): కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టేందుకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలను ఆగం చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల మీద ఈ ప్రభుత్వానికి అంత ప్రేమెందుకని నిలదీశారు. మహిళా బిల్లు కోసం ప్రత్యేకంగా పార్లమెంట్ సమావేశాలు నిర్వహించినప్పుడు లక్షలాది మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు న్యాయం చేసేందుకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఎందుకు నిర్వహించటం లేదని ప్రశ్నించారు. వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని కోరారు. దీనిపై తెలంగాణ విద్యా కమిషన్ ముసాయిదా బిల్లు సిద్ధం చేసి నెలలు గడుస్తున్నా ఎందుకు కాలయాపన చేస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీపై ముఖ్యమంత్రి ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. పేదలు, మధ్య తరగతి ప్రజల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించటం కచ్చితంగా వారిని మోసం చేయటమేనని అన్నారు.


**కార్పొరేట్ విద్యా సంస్థలతో లాలూచీ**

ముసాయిదా బిల్లు సిద్ధమైన తర్వాత కూడా భారీ ఎత్తున కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులు పెంచాయని గుర్తు చేశారు. సామాన్య ప్రజలు ఫీజులు చెల్లించలేక ఆగమవుతుంటే ప్రభుత్వం మాత్రం ఈ బిల్లును అటకెక్కించిందని మండిపడ్డారు. కార్పొరేట్ విద్యా సంస్థల లాబీతో ప్రభుత్వానికి లాలూచీ ఏంటనీ ప్రశ్నించారు. వారితో ఏవైనా ఒప్పందాలు ఉన్నాయా? లేదంటే రహస్య అజెండా ఉందా చెప్పాలని నిలదీశారు. ఫీజుల దోపిడీ కారణంగా సామాన్య కుటుంబాల జీవితకాలపు పొదుపు మొత్తం హారతి కర్పూరంలా కరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

**సేవ్ సింగరేణి రౌండ్ టేబుల్ సమావేశం**

సింగరేణి సంస్థను కాపాడేందుకు తెలంగాణ జాగృతి, హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో ఆదివారం సేవ్ సింగరేణి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొంటారు. సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహణ, సంస్థకు ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు, అలియాస్ పేర్ల అంశం, కారుణ్య నియామకాలు, సంస్థ మనుగడ కోసం చేపట్టాల్సిన చర్యలను ఈ సమావేశంలో చర్చించనున్నారు.







ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

– శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# బీఆర్ఎస్ పొదిలో క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నం

### మున్సిపాలిటీలు కైవసం చేసుకున్న కారు పార్టీ.. ప్రజాస్వామ్య జయకేతనం: కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఈవార్తలు): క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ పీఠాలు బీఆర్ఎస్ కైవసం చేసుకోవడం ప్రజాస్వామ్య జయకేతనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని కాంగ్రెస్ ఎన్ని అరాచకాలు చేసినా ఆ స్థానాలను బీఆర్ఎస్ దక్కించుకుందని అన్నారు. ఇది హర్షణీయమని పేర్కొన్నారు. అణిచివేత, అప్రజాస్వామిక చర్యలకు రాష్ట్రంలో చోటులేదని ఈ తీర్పు స్పష్టం చేసిందని తెలిపారు. విజయం సాధించిన ఆయా మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ గెలుపు కోసం కృషి చేసిన బాల్క సుమన్, మంచిరెడ్డి కిషన్ రెడ్డి తదితరులకు ఆయన అభినందనలు తెలియజేశారు. "అడ్డదారుల్లో ఈ స్థానాలను కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఎన్ని



రకాల ప్రలోభాలు పెట్టినా, రకరకాలుగా ఒత్తిళ్లు తెచ్చినా వేటికి లొంగకుండా మొక్కవోని దీక్షతో ఒక్క తాటిపై నిలిచిన కౌన్సిలర్లకు ప్రత్యేకంగా సెల్యూట్ చేస్తున్నా. క్యాతనపల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకునేందుకు మిత్రపక్షమైన సీపీఐ కామ్రేడ్ల అడుగడుగునా కనబరిచిన పోరాట పటిమ ఎంతో స్ఫూర్తిదాయకం" అన్నారు. అణచివేతకు, బెదిరింపులకు, అవినీతి అక్రమాలకు, అప్రజాస్వామిక చర్యలకు తెలంగాణలో తావులేదని ఈ తీర్పు తేల్చి చెప్పిందని పేర్కొన్నారు. రెండున్నరేళ్లలోనే పీకల్లోతు ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో కౌంట్ డౌన్ మొదలైందని ఈ ఫలితాలు నలుదిశలా చాటి చెప్పాయని అన్నారు. అటు పంచాయతీ, ఇటు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ముచ్చెమటలు పట్టించిన గులాబీ జెండా సైనికులను పార్టీ ఎప్పటికీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ విజయాలు అందించిన స్ఫూర్తిని కొనసాగిద్దామని, కోట్లాడి తెచ్చుకున్న తెలంగాణను అడుగడుగున ధ్వంసం చేస్తున్న రేవంత్ సర్కారుకు బుద్ధి చెబుదామని పిలుపునిచ్చారు.

# కేజీబీవీల్లో ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్

హనుమకొండ, ఏప్రిల్ 4 (ఈవార్తలు): పేద, మధ్యతరగతి విద్యార్థినులకు కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 93 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) 2026–27 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. హనుమ కొండ జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ గౌడ్ శనివారం ఈ వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది నుంచి కేజీబీవీలను 'యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్' కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కేంద్రాల్లో ఇంటర్ విద్యతో పాటు ఐఐటీ–జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు కూడా నిపుణులతో ఉచితంగా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఆసక్తిగల విద్యార్థినులు ఏప్రిల్ 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో "స్త్రతీయఎ.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే 5న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. హనుమకొండ జిల్లాలోని కమలాపూర్, ఐనవోలు, ధర్మసాగర్ కేజీబీవీలను ఎక్సలెన్స్



సెంటర్లుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ విద్యాలయాల్లో చేరిన విద్యార్థినులకు ఉచిత విద్య, హాస్టల్ వసతి, లైబ్రరీ సౌకర్యాలతో పాటు మానసిక వికాసానికి సైకాలజీ క్లాసులు నిర్వహిస్తారు. క్రీడలు, యోగా, ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్‌లో కూడా శిక్షణ ఇస్తారు. మరిన్ని వివరాలకు 040-24734899 లేదా 18004252428 నంబర్లను సంప్రదించాలని అధికారులు కోరారు. అర్హులైన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# యువతపై కాంగ్రెస్ నిర్లక్ష్యం: వద్దిరాజు

కొత్తగూడెం, ఏప్రిల్ 4 (ఈవార్తలు): కొత్తగూడెం ప్రగతి మైదానంలో నిర్వహించిన గాయత్రి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పాల్గొన్నారు. స్వయంగా బ్యాట్ పట్టి క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడి, వారిలో ఉత్సాహం నింపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడల్లో రాణించడం ద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని రవిచంద్ర పేర్కొన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేస్తోందని, ముఖ్యంగా యువతను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రవ్యాప్తంగా క్రీడా మైదానాల అభివృద్ధి జరిగిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా తయారైందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను యువత ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు.

## ముఖ్యమంత్రి రౌడీ మాటల వల్లే..!

**కాంగ్రెస్ కార్యకర్తలు రెచ్చిపోతున్నారు**


**మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ధ్వజం**



హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఈవార్తలు): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడి ఘటనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రంగా స్పందించారు. సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి ఫొటోతో క్యాంప్ కార్యాలయంలోకి దూసుకెళ్లిన కాంగ్రెస్ కార్యకర్తలు, అక్కడ ముఖ్యమంత్రి ఫొటోను ఉంచారు. అనంతరం కార్యాలయంలో జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడిని సబితా ఇంద్రారెడ్డి ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యల కారణంగానే కాంగ్రెస్ కార్యకర్తలు ఇలా రెచ్చిపోతున్నారని ధ్వజమెత్తారు. మా దగ్గర కూడా కండలు తిరిగినవాళ్లు ఉన్నారంటూ అసెంబ్లీలో ముఖ్యమంత్రి అన్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఇలాంటి రౌడీ మాటలు మాట్లాడటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉండేవని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై పట్టపగలే దాడులు జరుగుతుంటే పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని ఆరోపించారు. ఈ దాడికి పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్‌ది అధికార మదం: హరీశ్ రావు

సిద్దిపేట, ఏప్రిల్ 4 (ఈవార్తలు): మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు చెందిన గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేశారని, ఇది ముమ్మాటికీ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని ఆయన ఆరోపించారు. హరీశ్ రావు మాట్లాడుతూ.. "పట్టపగలే అధికార మదంతో కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరు బీహార్ గ్యాంగ్‌లను తలపిస్తోంది. ప్రజాప్రతినిధుల కార్యాలయాలపైనే దాడులు జరుగుతుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నట్టా, లేనట్టా?" అని ప్రశ్నించారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం అధికార పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిందా? అని నిలదీశారు. "ఒకవైపు 'హేట్ స్పీచ్ బిల్' పేరుతో ప్రతిపక్షాల నోరు నొక్కుతూ, మరోవైపు తమ గూండాలతో దాడులు చేయించడమేనా ప్రజా పాలన? ఇందిరమ్మ రాజ్యం పేరుతో గూండా రాజ్యాన్ని అమలు చేస్తారా?" అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీఎం, మంత్రులు ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఉంటూ, ఇక్కడి పాలనను గాలికొదిలేశారని విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులు చేయాలని కాంగ్రెస్ నాయకులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారా అనే అనుమానం కలుగుతోందని అన్నారు. కాంగ్రెస్ అణచివేతలకు, దాడులకు బీఆర్ఎస్ పార్టీ అదరదు, బెదరదని హరీశ్ రావు స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని తెలిపారు. క్యాంపు కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని డీజీపీని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు ఆగకపోతే ప్రజలే వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

# జర్నలిస్టులపై పాలకుల వివక్ష

## పోరాటం లేనిదే సమస్యలు పరిష్కారం కావు

### టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య



ఖమ్మం, ఏప్రిల్ 4 (ఈవార్తలు): జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం,పాలకులు చూపుతున్న వివక్ష,నిర్లక్ష్య వైఖరిని విడనాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టిడబ్ల్యుజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం జిల్లా కేంద్రంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండి పని చేస్తున్న పాత్రికేయులు తమ సమస్యలపై రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల గడిచినా, ఇంతవరకు జర్నలిస్టులకు సంబంధించిన ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని, కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉందని ఆయన ధ్వజమెత్తారు. అక్రెడిటేషన్ కార్డుల్లో కోత లేకుండా అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త అక్రెడిటేషన్లు ఇవ్వాలని, అదేవిధంగా ప్రభుత్వం జర్నలిస్టుల కోసం ప్రకటించిన మ్యానిఫెస్టో అంశాలను అమలు చేయాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. జర్నలిస్టుల పట్ల గతంలో ఎన్నడూ లేని వివక్ష కొనసాగుతుందని, అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను గందరగోళం చేసి జర్నలిస్టులను ఆందోళన వైపుకు నెట్టారని అన్నారు. ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్య వైఖరి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల ఆందోళనను ఉధృతం చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఖమ్మం జిల్లాలో చాలా ఏళ్ళుగా పెండింగ్ లో ఉన్న ఇళ్ళస్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో టీడబ్ల్యూజేఎఫ్ ( హెచ్-2843) నాయకులు జర్నలిస్టుల సమస్యల, సంక్షేమం వైపు దృష్టి సారించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ సంఘాన్ని బలోపేతం చేయాలని ఆయన సూచించారు. జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ (హెచ్-2843) హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, ఖమ్మం జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, కోశాధికారి నగేష్,లీగల్ అడ్వయిజర్ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.




# దలైలామాను కలిసిన ఆర్ కృష్ణయ్య కొడుకు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఈవార్తలు): హిమాచల్ ప్రదేశ్ లోని టెన్జిన్ గ్యాట్సో (14వ దలైలామా)ను రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య తనయుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్. అరుణ్ కుమార్ కలిసి టిబెట్ ప్రజల స్వేచ్ఛ కోసం జరుగుతున్న పోరాటానికి తమ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా అహింసా మార్గంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన దలైలామా అరుణ్ కుమార్ ను ప్రోత్సహిస్తూ ఆశీస్సులు అందజేశారు. శాంతి, కరుణ, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచిన దలైలామా మార్గదర్శనం యువతకు ప్రేరణగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ బేటి సామాజిక న్యాయం, మానవ హక్కులు, శాంతి కోసం కృషి చేసే నాయకుల మధ్య స్ఫూర్తిదాయకమైన అనుబంధాన్ని మరింత బలోపేతం చేసిందని ఆయన పేర్కొన్నారు.

# సరిహద్దులు దాటిన స్నేహం

## 35 ఏళ్ల తరువాత కలుసుకున్న దోస్తులు




ట్రెండ్ మారినా.. తరాలు మారినా.. ఫ్రెండ్షిప్ మాత్రం మారదు. 35 ఏళ్ల తర్వాత మిత్రులు (పాత స్నేహితులు) కలవడం ఒక అద్భుతమైన అనుభూతి. ఈ వయసులో, కెరీర్, కుటుంబ బాధ్యతల మధ్య మర్చిపోయిన పాత జ్ఞాపకాలు, మధురమైన అనుభూతులు,నిష్కల్మషమైన స్నేహం మళ్ళీ చిగురించింది. వారణాసి సుధాకర్ చారి, శశీ అనే ఇద్దరు ఫ్రెండ్స్ సుదీర్ఘ కాలం అంటే 35 ఏళ్ల తరువాత కలుసుకుని పాత జ్ఞాపకలను నెమరేసుకున్నారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం, పామాపురం గ్రామానికి చెందిన సుధాకర్ వరంగల్‌లో నయింనగర్ లోని సీవీ రామన్ స్కూల్లో 10 వ తరగతి చదివారు. అప్పుడు స్కూల్‌లో బెస్ట్ ఫ్రెండ్‌గా ఉన్న శశి ఉన్నత చదువులు అయిపోయాక ఆస్ట్రేలియా వెళ్లి అక్కడ స్థిరపడ్డారు. అయితే, ఆ బ్యాచ్ కు చెందిన ఓ ఫ్రెండ్ వాట్సాప్ క్రియేట్ చేయడంతో అందరూ ఈ వేదికపై కలుసుకుని ముచ్చటించుకునే వారు. కాని ప్రత్యక్షంగా కలిసిన సందర్భాలు అస్సలు లేవు. అయితే, వ్యక్తిగత పని నిమిత్తం ఆస్ట్రేలియా నుంచి శశి హైదరాబాద్‌కు రావడంతో విషయం తెలుసుకున్న సుధాకర్ ప్రత్యేకంగా కలుసుకున్న సమయంలో ఇద్దరూ భావోద్వేగానికి గురయ్యారు. మూడు దశాబ్దాల క్రితం నాటి పాఠశాల కబుర్లను సింహావలోకనం చేసుకున్నారు. మానవ జన్మకు తరగని ఆస్తి ఉందంటే అది ఒక స్నేహమే అని సుధాకర్ పేర్కొన్నారు.




# బీమా లేదు.. పరిహారం లేదు

### పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

### మాజీ మంత్రి జీవన్ రెడ్డి డిమాండ్

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 4 (ఈవార్తలు): ప్రకృతి వైపరీత్యంతో మొక్కజొన్న,మామిడి పంట నష్టపోయిన రైతులకు పంటకు బీమా చేయలేదు ప్రభుత్వ నుండి పరిహారము అందడం లేదని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి అన్నారు. శనివారం రాయికల్ పట్టణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాజీమంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న, మామిడి పంటలకు భీమ పథకం అమలు లేనందున పకృతి వైపరీత్యంతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 20 వేలు నష్టపరిహారాన్ని అందించి ఆదుకోవాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి మేలు కలిగే రైతు భరోసాను ఆంక్షలు లేకుండా ఎకరాకు 6000 అందించి రైతులకు అండగా నిలవాలని సూచించారు. ఆరుతడి పంటలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఇటీవల ఇబ్రహీంపట్నంలో ప్రారంభించి తూకం కు సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని తూకం వెయ్యడంలో జాప్యం జరుగుతుందన్నారు. రైతు బీమా పథకంతో 60 లక్షల మంది రైతులకు బీమా వర్తిస్తుందని అన్నారు. రైతు బీమా సౌకర్యం పొందలేని కుటుంబాలకు ఇందిరమ్మ సమగ్ర కుటుంబ బీమా పథకం యజమానికి కాకుండా కుటుంబాన్ని యూనిట్ గా చేసుకొని కోటి 10 లక్షల మంది తెల్ల రేషన్ కార్డు దారులు బీమా అందించాలన్నారు. ఏప్రిల్ 15 రైతుల పంటలకు ఎస్సారెస్పీ నీరు అందించాలన్నారు.

## జగిత్యాలలో జగ్జీవన్ విగ్రహ ఏర్పాటుపై ఉద్రిక్తత



జగిత్యాల టౌన్, ఏప్రిల్ 4 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాకేంద్రంలో విగ్రహ స్థాపన అంశం ఉద్రిక్తతకు దారి తీసింది. మంచినీళ్ల బావి వద్ద విగ్రహం ఏర్పాటు విషయంలో రెండు వర్గాల మధ్య వివాదం నెలకొంది. డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ఒక వర్గం ప్రయత్నించగా, మరో వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. ఇదే సమయంలో అదే ప్రదేశంలో శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలని మరో వర్గం ఆందోళనకు దిగడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న పట్టణ సీఐ కరుణాకర్ ఘటనాస్థలానికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.



## గ్రామసభల పేరిట ప్రజాధనం వృథా: దావ వసంత

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 4 (ఈవార్తలు): గ్రామసభలు, వార్డు సభల పేరిట ప్రజాధనం వృథా అవుతోందని మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ విమర్శించారు. సమస్యలకు పరిష్కారం లేని సభలు నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన గ్రామసభలు, వార్డు సభలు ఎవరి కోసం నిర్వహించారో స్పష్టం కావడం లేదన్నారు. గతంలో ప్రజాపాలన పేరిట స్వీకరించిన దరఖాస్తుల్లో ఒక్కదానికి కూడా పరిష్కారం దొరకలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని ఆరోపించారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పినా ఇప్పటివరకు ఫలితం కనిపించలేదన్నారు. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారిగా ఉండాల్సిన గ్రామసభలు నామమాత్రంగా నిర్వహిస్తున్నారని విమర్శించారు. హామీలు అమలు కాలేక అధికారులు, ప్రజాప్రతినిధులు సభలకు వెనుకడుగు వేస్తున్నారని తెలిపారు. మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రాష్ట్రంలో ఏ మార్పు తీసుకువచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. జగిత్యాల ప్రజలు ఒక పార్టీకి ఓటు వేస్తే, గెలిచిన ఎమ్మెల్యే వేరే పార్టీలోకి వెళ్లడం ప్రజల విశ్వాసానికి విఘాతం కలిగించిందన్నారు. కేసీఆర్ పాలనలో అమలైన పథకాలనే ఇప్పుడు చెప్పుకుంటున్నారని, కొత్తగా ప్రజలకు ఉపయోగపడే చర్యలు కనిపించలేదని అన్నారు. గ్రామసభలు, వార్డు సభల పేరిట కొత్త నాటకం ఆడుతున్నారని, ప్రజలకు ఉపయోగం లేకుండా ప్రభుత్వ ధనం వృథా అవుతోందని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని దావ వసంత సురేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఫార్మాకు కేంద్రం దన్ను

## ఎగుమతుల విస్తరణకు మద్దతు.. కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్



హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఈవార్తలు): దేశంలో ఫార్మా రంగ అభివృద్ధికి, ఎగుమతుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ మద్దతు అందిస్తుందని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ తెలిపారు. భారత ఫార్మా రంగాన్ని మరింత బలోపేతం చేసి, స్వయం సమృద్ధి సాధించే దిశగా కేంద్ర వాణిజ్య శాఖ.. భారత ఫార్మాస్యూటికల్స్ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఫార్మెక్సిల్) సహకారంతో హైదరాబాద్‌లో 'చింతన్ శివిర్'ను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజేశ్ అగర్వాల్ మాట్లాడుతూ.. భారత ఫార్మా పరిశ్రమ బలమైన వృద్ధిని సాధిస్తోందని, ప్రపంచ జనాభాలో 18-19 శాతం వాటా కలిగిన భారత్ పెద్ద మార్కెట్ అని పేర్కొన్నారు. ప్రస్తుతం సుమారు 60 బిలియన్ డాలర్ల విలువ కలిగిన ఈ రంగంలో దాదాపు 50 శాతం ఎగుమతుల నుంచి వస్తోందని తెలిపారు. ధరల పోటీతత్వం, జెనరిక్ మందుల్లో ప్రపంచ నాయకత్వం కారణంగా భారత్ 'ప్రపంచపు ఫార్మసీ'గా అవతరించిందని వివరించారు. అనిశ్చితి, భౌగోళిక రాజకీయ అస్థిరత ఉన్న నేపథ్యంలో స్వయం సమృద్ధి సాధన అత్యంత అవసరమని ఉద్ఘాటించారు. దేశీయ ఫార్మా అవసరాల్లో 80-90 శాతం స్వదేశీ ఉత్పత్తి ద్వారా తీర్చుకోవాలని, ఏపీఐలు, బల్క్ డ్రగ్స్, ఇంటర్మీడియట్లలో దిగుమతులపై ఆధారపడటం తగ్గించాలని పిలుపునిచ్చారు. నాణ్యత, తక్కువ ఖర్చుతో కూడిన ఔషధాలకు భారత్ ప్రపంచ కేంద్రంగా మారాలని, బయోలాజిక్స్, బయోసిమిలర్స్ వంటి అధునాతన రంగాలకు అనుగుణంగా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. పరిశ్రమను 'పరిమాణం ఆధారితం' నుంచి 'విలువ ఆధారితం' వైపు మార్చాలని, కొత్త పేటెంట్లు, ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని అన్నారు.



## మంత్రి పదవి ఇస్తే రాజీనామా చేసే వారా?

### జగిత్యాల కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 4 (ఈవార్తలు): మాజీ మంత్రి జీవన్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తే పార్టీని వీడేవారా? అని జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఎవరిని మీరు ఊరి పొలి మేర దాటనివ్వలేదని ఆరోపించారు. శనివారం జగిత్యాలలో నందయ్య విలేకరులతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా అవ్వకముందు కాంగ్రెస్ పార్టీ కొన ఊపిరితో వెంటిలేటర్ పై ఉందని, దాన్ని రేవంత్ రెడ్డి ప్రాణాలతో బ్రతికించారని జీవన్ రెడ్డి తెలుసుకోవాలన్నారు. నాలుగు దశాబ్దాలుగా తాను మీ వెంటే ఉన్నా, పార్టీ ఎన్నడు మిమ్మల్ని ఇబ్బంది పెట్టలేదు, గౌరవంగానే చూసిందన్నారు. మీరు ఏ కార్యకర్తను కూడా ధరూరు శివారు దాటినివ్వలేదని ఆరోపించారు. గత 20 సంవత్సరాలుగా బిఆర్ఎస్ పార్టీని విమర్శించిన మీరు నేడు కాళేశ్వరం లేకపోతే తెలంగాణనే లేదనే విధంగా మాట్లాడడం ఎంతవరకు సమంజసమని నందయ్య ప్రశ్నించారు. కేవలం నెల రోజులలోనే బిఆర్ఎస్ పార్టీపై మీకెందుకు ఇంత ప్రేమ వచ్చిందన్నారు. రేవంత్ ప్రభుత్వం ఎందుకు దిగిపోవాలి.. సంక్షేమ పథకాలు అమలు చేసినందుకా..?అని నందయ్య నిలదీశారు. మీకు ఎమ్మెల్సీ రెన్యువల్ చేసి మంత్రి పదవి ఇచ్చి ఉంటే మీరు పార్టీకి రాజీనామా చేసేవారు కాదు కదా..? మీరే మంత్రి పదవి నాకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించిన మాట వాస్తవం కాగా అని ప్రశ్నించారు. మీ అనుచరులు డిసిసి అధ్యక్షుడు 20 లక్షలకు కౌన్సిలర్ టికెట్ అమ్ముకున్నాడని విమర్శిస్తే మీరు ఎందుకు వారించలేదని, నాలుగు దశాబ్దాలుగా నా నిబద్ధత మీకు తెలియదా..అని గుర్తు చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీతో మీరు కలిసి పని చేయాలని కోరుతున్నామని నందయ్య అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, పిసిసి కార్యదర్శి గిరి నాగభూషణం, జగిత్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, రవీందర్ రావు, పిప్పరి అనిత, భీరం రాజేష్, ముకేశ్ ఖన్నా,కౌన్సిలర్లు బోయిన పెల్లి ప్రశాంత్ రావు, పిట్ట ధర్మరాజు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూకపెల్లి కాలనీకి బస్సు సౌకర్యం కల్పించాలి



జగిత్యాల టౌన్, ఏప్రిల్ 4 (ఈవార్తలు): నూకపెల్లి డబుల్ బెడ్రూం కాలనీకి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ శనివారం మాజీ కౌన్సిలర్ హన్మాండ్ల జయశ్రీ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2008లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 4వేల మందికి ఇంటినిర్మాణం చేపట్టాలని ఒక్కొక్కరికి 70 గజాల స్థలాన్ని, రూ.70 వేల ఆర్థిక సాయాన్ని అందించిందని, కొందరు తమ ఇళ్ళను పూర్తి చేసుకోగా, మరికొందరు వివిధ దశల్లో తమ పనులు నిలిచి పోవడంతో పూర్తి చేసుకోలేదని, 2014లో అధికారంలోకి వచ్చిన టిఆర్ఎస్ ప్రభుత్వం 2018లో 4520 ఇళ్లను నిర్మించి, మూడేళ్ల క్రితం లబ్దిదారులకు ఇళ్లను కేటాయించిందని, మూడేళ్ల నుండి ఇప్పటి వరకు నూక పెల్లి డబుల్ బెడ్రూం కాలనీకి రవాణా సౌకర్యం కల్పించకలేకపోయారని, నూకపెల్లి నుండి జగిత్యాలకు వేళ్లడానికి 7నుండి 8 కిలోమీటర్ల దూరం ఉండడంతో ప్రతిరోజు నూక పెల్లి నుండి జగిత్యాలకు రావడానికి ఒక్కొక్క కుటుంబానికి రూ.200 ఖర్చు అవుతుందని తెలిపారు. నూకపెల్లిలో ప్రతి రోజు మూడు సార్లు బస్సు రవాణా సౌకర్యం అయ్యేలా ఆదేశాలు జారీ చేయాలని లేఖలో పేర్కొన్నారు.



## వాణిజ్య పంటలపై దృష్టిపెట్టాలి

### రైతులకు ఎమ్మెల్యే సంజయ్ పిలుపు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 4 (ఈవార్తలు): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, లాభదాయకమైన పంటల సాగుపై దృష్టి సారించాలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సూచించారు. శనివారం తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్, కరీంనగర్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో జగిత్యాల వ్యవసాయ మార్కెట్లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో 46 వేల ఎకరాల్లో, నియోజకవర్గంలో 14 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు జరిగిందన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరగా, వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలు మంజూరు చేసినట్లు తెలిపారు. మద్దతు ధరపై కేంద్రంపై విమర్శలు కేంద్ర ప్రభుత్వం రూ.2400 మద్దతు ధర ప్రకటించినప్పటికీ మొక్కజొన్న కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. కేంద్రం పంటను కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర అందించాలని డిమాండ్ చేశారు. రైతులు వరి వంటి ఒకే పంటపై ఆధారపడకుండా ఆయిల్ పామ్ వంటి లాభదాయక పంటల సాగు వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఆయిల్ పామ్ పంటతో టన్నుకు సుమారు రూ.23 వేల వరకు లాభం పొందవచ్చన్నారు. అంతర్ పంటగా కోకో సాగు కూడా చేపట్టవచ్చని తెలిపారు. దేశంలో ఆయిల్ దిగుమతులు అధికంగా జరుగుతున్నాయని, ఇతర పంటల సాగు ద్వారా దిగుమతుల భారాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## తగ్గిన కొండగట్టు అంజన్న ఆదాయం

గత ఏడాదితో పోల్చితే 3 లక్షలు తక్కువ

మల్యాల, ఏప్రిల్ 4 (ఈవార్తలు): కొండగట్టు ఆంజనేయస్వామి విజయోత్సవం (చిన్న జయంతి) సందర్భంగా వచ్చిన ఆదాయ వివరాలను వెల్లడించారు. కేశఖండనం, లడ్డూ ప్రసాదం, పులిహోర ప్రసాదం, దీక్ష విరమణ, శీఘ్రదర్శనం టికెట్ల అమ్మకం ద్వారా రూ.1,63,10,290 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అయితే, ఈ ఆదాయం గత ఏడాది కంటే దాదాపు 3 లక్షలు తక్కువ కావడం గమనార్హం. గత ఏడాది ఇదే సమయంలో రూ.1,66,88,320 ఆదాయం సమకూరింది. ఏటేటా ఆదాయం పెరుగుతూ పోవాల్సి ఉండగా, ఆదాయం తగ్గడం ఆలయ కమిటీ నిర్వహణ తీరును అద్దంపడుతోందని భక్తులు విమర్శిస్తున్నారు.

## కొండగట్టు అసెంబ్లీ ఏర్పాటుపై అఖిలపక్ష భేటీ

మల్యాల, ఏప్రిల్ 4 (ఈవార్తలు): డీలిమిటేషన్‌లో భాగంగా కొత్తగా ఏర్పాటు కాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లలో కొండగట్టు, జగిత్యాలను చేర్చే అంశంపై జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో ఆదివారం అఖిలపక్ష భేటీ నిర్వహించనున్నారు. కొండగట్టును అసెంబ్లీ చేయాలని, జగిత్యాలను పార్లమెంట్ నియోజకవర్గంగా మార్చాలని ప్రతిపాదనలు పంపేందుకు మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో చర్చ నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి యువజన సంఘాల ప్రతినిధులు, కుల సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, విద్యార్థులు, మేధావులు తరలిరావాలని నిర్వాహకులు కోరారు.

## 28 జిల్లాలతో ఏపీ కొత్త మ్యాప్

అమరావతి, ఏప్రిల్ 4 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 28కి పెరిగింది. పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర పటంలో మార్పులు చేసిన ప్రభుత్వం, రెండు కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు 28 జిల్లాలతో కూడిన నూతన మ్యాప్‌ను ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ అధికారికంగా విడుదల చేసింది. ఈ మ్యాప్‌లో రాష్ట్ర రాజధానిగా అమరావతిని స్పష్టంగా పేర్కొనడం గమనార్హం. ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతాలను వేరు చేస్తూ మార్కాపురం కేంద్రంగా ఒక జిల్లాను, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలతో పోలవరం కేంద్రంగా మరో జిల్లాను ఏర్పాటు చేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రజలకు పాలనను మరింత చేరువ చేసేందుకు, అభివృద్ధిని వికేంద్రీకరించే లక్ష్యంతోనే ఈ పునర్విభజన చేపట్టినట్లు ప్రభుత్వం చెబుతోంది.

# క్రీడలతో మానసిక, శారీరక ధారుద్యం

### సాటా అధ్యక్షుడు మల్లేశన్



జగిత్యాల టౌన్, ఏప్రిల్ 4 (ఈవార్తలు): క్రీడలతో మానసిక, శారీరక ధారుద్యం పెంపొందుతుందని సాటా అధ్యక్షుడు మల్లేశన్ అన్నారు. సౌదీ అరేబియాలోని జెడ్డా నగరంలో హైద్రాబాద్ కు చెందిన నయీం ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో గోల్డెన్ సిసి జట్టు 15 ఓవర్లలో 204 పరుగులు సాధించగా, ఈజెఎసి సిసి జట్టు 15 ఓవర్లలో 202 పరుగులు సాధించగా, 2 పరుగులతో గోల్డెన్ సిసి జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా సాటా అధ్యక్షుడు మల్లేశన్ మాట్లాడుతూ హైద్రాబాద్ కు చెందిన నయీం 2016 నుండి క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయమని, ఎప్పుడు తమ తమ పనుల్లో ఉండే ప్రవాస భారతీయులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి ఆటవిడుపు కల్గిస్తున్నారని కొనియాడారు. అనంతరం విన్నర్, రన్నర్ జట్లకు ట్రోఫిలను అందించారు.ఈ కార్యక్రమంలో సాటా రియాద్ అధ్యక్షుడు శ్రీనివాస్ మచ్చ, తేజా, జట్టు సభ్యులు పాల్గొన్నారు.

# ఆ సినిమాలపై కాంగ్రెస్ దుష్ప్రచారం



తిరువనంతపురం: ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్‌తో పాటు ఇతర విపక్ష పార్టీలు 'ధురందర్', 'ది కేరళ స్టోరీ', 'ది కశ్మీర్ ఫైల్స్' వంటి సినిమాలతో పాటు పలు అంశాలపై ఉద్దేశపూర్వకంగా అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయని ఆయన బహిరంగంగా ఆరోపించారు. కేరళ ఎన్నికల ప్రచారంలో భాగంగా, ఒక బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ.. "కాంగ్రెస్, యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ పార్టీలు ప్రతి విషయంలోనూ అబద్ధాలు చెబుతాయి. అది వారి నైజంగా మారింది. దేశాన్ని తప్పుదోవ పట్టించడమే వారి స్వభావం" అని అన్నారు. సినిమాల విషయంలోనూ ప్రతిపక్షాలు ఇదే తీరును ప్రదర్శిస్తున్నాయని ఆయన విమర్శించారు. "అబద్ధాలు చెప్పడంలో వారు నిపుణులు. 'ది కేరళ స్టోరీ' వచ్చినప్పుడు అదంతా అబద్ధం అన్నారు. 'ది కశ్మీర్ ఫైల్స్' వచ్చినప్పుడు కూడా అదే మాట అన్నారు. ఇప్పుడు 'ధురందర్' సినిమా విషయంలోనూ అబద్ధమని ప్రచారం చేస్తున్నారు" అని ప్రధాని పేర్కొన్నారు. గతంలో సీఏఏ చట్టం తెచ్చినప్పుడు కూడా దేశవ్యాప్తంగా ఎన్నో అబద్ధాలు ప్రచారం చేశారని, కానీ ఇప్పుడు ఆ చట్టం అమల్లోకి వచ్చినా దేశానికి ఎలాంటి నష్టం జరగలేదని మోదీ గుర్తుచేశారు. "యూసీసీ, ఎఫ్‌సీఆర్ఏ వంటి అంశాల్లోనూ వారు అవే అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. గోవాలో దశాబ్దాలుగా యూసీసీ అమల్లో ఉంది. అబద్ధాలు వ్యాప్తి చేయడమే వారి వ్యాపారం" అని ప్రధాని మోదీ తీవ్రంగా విమర్శించారు. ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన 'ధురందర్', వివేక్ అగ్నిహోత్రి రూపొందించిన 'ది కశ్మీర్ ఫైల్స్', సుదీప్తో సేన్ డైరెక్ట్ చేసిన 'ది కేరళ స్టోరీ' చిత్రాలు వాటి కథావస్తువుల కారణంగా రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. జాతీయ భద్రత, కశ్మీరీ పండిట్ల వలస, కేరళ యువతుల ఉగ్రవాద రిక్రూట్‌మెంట్ వంటి అంశాలపై ఈ సినిమాలు తెరకెక్కాయి.

**దక్షిణాది సీట్లు తగ్గవు**

జనాభా నియంత్రణ వల్ల దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభ సీట్లను కోల్పోతాయనే వాదనలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. పథనంథిట్టలోని తిరువల్ల మున్సిపాలిటీలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ, కేరళలో ఎల్డీఎఫ్ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ మొదలైందని అన్నారు. ఇక్కడ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్డీయే అధికారంలోకి వస్తే ఈశాన్య రాష్ట్రాల్లో మాదిరి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పశ్చిమాసియాలో ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం అంశంతో భయాన్ని సృష్టించే వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళలో శబరిమల రైల్వే ప్రాజెక్టు కొత్త అవకాశాలను తీసుకువస్తుందని అన్నారు. ఇది శబరిమలకు ప్రత్యేక అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని అన్నారు. దీని ద్వారా స్థానిక వ్యాపారాలు ఊపందుకుంటాయని, యువతకు కొత్త ఉపాధి మార్గాలు వస్తాయని ఆయన అన్నారు. ఇలాంటి ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం అసంపూర్ణంగా వదిలేసిందని విమర్శించారు. కేరళలో బీజేపీ గెలిస్తే, డబుల్ ఇంజిన్ సర్కార్ అవుతుందని, అప్పుడు అడ్డంకులన్నీ తొలగిపోతాయని ప్రధాని మోదీ అన్నారు.



## జాతీయ రహదారుల్లోని సీసీకెమెరాల చోరీ

**పాకిస్థాన్‌లో దొంగల హల్‌చల్**

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని సింధ్, పంజాబ్ రాష్ట్రాల మధ్య ఉన్నరహదారులపై ఇదివరకు ప్రజలను దోచుకున్న ఘటనలు వెలుగుచూసేవి. కానీ ఇప్పుడు ప్రయాణికుల భద్రత కోసం ఏర్పాటు చేసిన నిఘా కెమెరాలు, ఇతర వస్తువులు చోరీకి గురవుతున్నాయి. సింధ్‌లోని సుక్కూర్ నుంచి పంజాబ్ రాష్ట్రంలోని రహీమ్ యార్ ఖాన్ వరకు ఉన్న సుక్కూర్-ముల్తాన్ హైవేలోని 200 కిలోమీటర్ల ప్రాంతం కెమెరా దొంగల కారణంగా తీవ్రంగా ప్రభావితమవుతోంది. ఈ ప్రాంతంలోని దొంగలు నిఘా కెమెరాలు, స్పీడ్ కెమెరాలు, సోలార్ ప్యానళ్లు, లైట్లు, ఇతర ఉపకరణాలు, స్థంభాలను దొంగిలిస్తున్నారని ఒక అధికారి తెలిపారు. దొంగలు సోలార్ రిఫ్లెక్టర్లను ధ్వంసం చేశారని, వీధి దీపాలను ఆర్పివేసి తమ కార్యకలాపాలను సాగిస్తున్నారని వెల్లడించారు. నిఘా, స్పీడ్ కెమెరాలను మాయం చేయడంతో ఈ జాతీయ రహదారిపై భద్రతను పర్యవేక్షించడానికి, వేగ పరిమితులను అమలు చేయడానికి ఆటంకంగా మారుతోందని చెప్పారు.

## విమానాల పునఃప్రారంభంపై ఆకాశ ఎయిర్‌లైన్స్ ప్రకటన

న్యూఢిల్లీ: ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో గల్ఫ్ దేశాలతో పాటు వివిధ దేశాలకు విమానాల రద్దు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆకాశ ఎయిర్‌లైన్స్ కీలక ప్రకటన చేసింది. అబుదాబికి తమ విమాన సేవలను దశలవారీగా తిరిగి ప్రారంభించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు ప్రకటించింది. అనుకూలమైన పరిస్థితులను సమీక్షిస్తున్నట్లు తెలిపింది. దోహా, రియాద్, కువైట్ ప్రాంతాలకు మాత్రం విమానాల రాకపోకల నిలిపివేత ఏప్రిల్ 12 వరకు కొనసాగుతుందని తెలిపింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో విమానయాన సేవల్లో తీవ్ర అంతరాయం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అక్కడి పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నట్లు ఆకాశ ఎయిర్ లైన్స్ తెలిపింది. సౌదీ అరేబియాలోని జెడ్డా నుంచి అహ్మదాబాద్, బెంగళూరు, ముంబై, కొచ్చి, కోజికోడ్ ప్రాంతాలకు విమాన సేవలను యథావిధిగా కొనసాగిస్తున్నట్లు తెలిపింది. అన్ని భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నామని వెల్లడించింది.

## అమిత్ షా పర్యటనలో భద్రతా వైఫల్యం

**బెంగాల్‌లో పోలీసు అధికారుల సస్పెన్షన్**

కోల్‌కతా: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటనలో భద్రతా వైఫల్యం, ఘర్షణ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం నలుగురు పోలీసు అధికారులను సస్పెండ్ చేసింది. రెండు రోజుల క్రితం అమిత్ షా పశ్చిమ బెంగాల్‌లోని భవానీపూర్‌లో పర్యటించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సువేందు అధికారి నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్ షోలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీనితో బీజేపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించి నివేదిక ఇవ్వాలని బెంగాల్ ప్రధాన కార్యదర్శిని కోరింది. ఆయన నివేదిక సమర్పించడంతో దాని ఆధారంగా ఈసీ చర్యలు తీసుకుంది. అమిత్ షా పర్యటనలో అనేక భద్రతా వైఫల్యాలు ఉన్నట్లు గుర్తించింది. దీనికి బాధ్యులను చేస్తూ సిద్ధార్థ్ దత్తా అనే డీసీపీ సహా మరో ముగ్గురిని సస్పెండ్ చేస్తూ ఈసీ నిర్ణయం తీసుకున్నది. అధికారులు శాంతిభద్రతలను కాపాడటంలో విఫలమయ్యారని పేర్కొంది. కాగా, భవానీపూర్ నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పోటీ చేస్తున్నారు. ఆమెపై రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సువేందు అధికారి బరిలోకి దిగారు. దీనితో ఈ నియోజకవర్గం కీలకంగా మారింది. ఇక్కడ మమతా బెనర్జీని ఓడించాలని బీజేపీ అన్ని ప్రయత్నాలు చేస్తోంది.

## మాకు ఎవరి అనుమతి అక్కర్లేదు

**అమెరికా అనుమతి వార్తలపై రష్యా కౌంటర్**

మాస్కో: చమురు సరఫరా కోసం తమకు ఇతర దేశాల అనుమతి అవసరం లేదని రష్యా స్పష్టం చేసింది. అమెరికా ఆదేశాలతో ప్రపంచ దేశాలకు రష్యా చమురు విక్రయిస్తోందని వార్తలు వచ్చాయి. దీనిని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఖండించింది. ఏ దేశానికి ఎంత చమురు సరఫరా చేయాలనేది తమ దేశానికి సంబంధించిన అంశమని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం తమ జాతీయ సార్వభౌమాధికారానికి సంబంధించినదని తెలిపింది. చమురు ఉత్పత్తి, ఎగుమతులకు సంబంధించిన నిర్ణయాలు పూర్తిగా దేశం చేతిలోనే ఉంటాయని పేర్కొంది. చమురు సరఫరా చేయడానికి ముందు రష్యా తమ అనుమతి పొందాలని ఇతర దేశాలు చేసే ప్రకటనలు ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారి డిమిత్రి బిరిచెవ్‌స్కీ తెలిపారు. ఇరాన్ యుద్ధం వేళ, రష్యా చమురు దిగుమతికి భారత్‌కు అమెరికా మినహాయింపు ఇచ్చిందనే వార్తల నేపథ్యంలో రష్యా నుంచి తాజా ప్రకటన రావడం గమనార్హం.

## శాశ్వత పరిష్కారమే మా లక్ష్యం

**ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ**

టెహ్రాన్: అమెరికాతో చర్చలకు ఇరాన్ నిరాకరించిందంటూ వస్తున్న వార్తలను ఆ దేశం ఖండించింది. చర్చలకు తాము ఎప్పుడూ సిద్ధమేనని, అయితే తమపై బలవంతంగా రుద్దిన ఈ యుద్ధానికి శాశ్వత ముగింపు పలకడమే తమ ప్రధాన లక్ష్యమని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి శనివారం స్పష్టం చేశారు. అమెరికా మీడియా తమ వైఖరిని తప్పుగా చిత్రీకరిస్తోందని ఆయన ఆరోపించారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఇస్లామాబాద్‌లో అమెరికా అధికారులతో జరిగే చర్చలకు ఇరాన్ హాజరుకావడం లేదని వాల్ స్ట్రీట్ జర్నల్ కథనాన్ని ప్రచురించింది. ఈ కథనాన్ని ఖండిస్తూ అరాఘ్చి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ లో ఒక ప్రకటన విడుదల చేశారు. "చర్చల కోసం ఇస్లామాబాద్ వెళ్లడానికి మేము ఎప్పుడూ నిరాకరించలేదు. మధ్యవర్తిత్వ ప్రయత్నాల కోసం పాకిస్థాన్‌కు మేం కృతజ్ఞతలు తెలుపుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న టెహ్రాన్‌తో పాటు ఇతర ఇరాన్ నగరాలపై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేయడంతో ఈ వివాదం మొదలైంది. ఈ దాడుల్లో ఇరాన్ అత్యున్నత నాయకుడు అలీ ఖొమైనీ మరణించారు. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్, మధ్యప్రాచ్యంలోని అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తోంది. "మాపై రుద్దిన ఈ చట్టవిరుద్ధమైన యుద్ధానికి శాశ్వతమైన, నిశ్చయాత్మకమైన ముగింపు పలికే నిబంధనలే మాకు ముఖ్యం" అని అరాఘ్చి తన ప్రకటనలో స్పష్టంగా పేర్కొన్నారు. తాత్కాలిక కాల్పుల విరమణ కన్నా, యుద్ధాన్ని పూర్తిగా ఆపే ఒప్పందంపైనే తమ దృష్టి ఉందని ఆయన పరోక్షంగా తేల్చిచెప్పారు.



## ముంబైని లాక్కునేందుకే అమరావతి బిల్లు

**కేంద్రంపై శివసేన తీవ్ర ఆరోపణలు**

ముంబై: ఏపీ రాజధానిగా అమరావతిని ఖరారు చేస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదింపజేసిన 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు, 2026' మహారాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ బిల్లును అడ్డం పెట్టుకుని భవిష్యత్తులో దేశ ఆర్థిక రాజధాని ముంబైను మహారాష్ట్ర నుంచి వేరు చేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాక్రే) వర్గం సంచలన ఆరోపణలు చేసింది. తమ పార్టీ అధికార పత్రిక 'సామ్నా' సంపాదకీయంలో ఈ విషయంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్రాల సరిహద్దులు, పేర్లు మార్చే అధికారం పార్లమెంటుకు ఉన్నప్పటికీ, రాష్ట్ర రాజధానిని నిర్ణయించుకునే హక్కు పూర్తిగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకే ఉంటుందని శివసేన గుర్తుచేసింది. అమరావతి బిల్లు ద్వారా కేంద్రం ఈ సంప్రదాయాన్ని ఉల్లంఘిస్తోందని, ఇది ప్రమాదకరమైన పోకడ అని విమర్శించింది. అమరావతి విషయంలో అనుసరించిన ఈ "అండర్‌గ్రౌండ్ టన్నెల్" విధానాన్నే భవిష్యత్తులో ముంబై విషయంలో ప్రయోగించి, మహారాష్ట్ర అధికారాలను నీరుగార్చే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ముంబైను చేజిక్కించుకోవడానికి కేంద్రం అనుసరించబోయే వ్యూహాన్ని కూడా 'సామ్నా' వివరించింది. ముందుగా "ముంబై జాతీయ ఆర్థిక మండలి" పేరుతో ఓ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టవచ్చని, నగరం యొక్క అంతర్జాతీయ ప్రాముఖ్యతను పొగుడుతూనే, దానిని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చేయవచ్చని ఆరోపించింది. అప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ షిండే, సునేత్రా పవార్ వంటి వారు దీనిని ముంబైకి గర్వకారణంగా అభివర్ణిస్తారని ఎద్దేవా చేసింది. మహారాష్ట్ర ప్రస్తుత నాయకత్వానికి "మహారాష్ట్ర ఆత్మాభిమానం" లేదని, వారు బలహీనంగా, ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని శివసేన తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. 106 మంది అమరవీరుల త్యాగంతో సాధించుకున్న ముంబై అస్తిత్వాన్ని కాపాడటంలో నేటి పాలకులు విఫలమయ్యారని దుయ్యబట్టింది. అమరావతిలో వేల ఎకరాలు సేకరించి, వందల కోట్లు ఖర్చు చేసినా నేటికీ నిర్మాణాల అస్థిపంజరాలే మిగిలాయని, కేవలం చట్టం చేసినంత మాత్రాన నగరం అభివృద్ధి చెందదని విమర్శించింది. ప్రస్తుత నాయకత్వం ఇలాగే మౌనంగా ఉంటే, భవిష్యత్తులో ముంబైను మహారాష్ట్ర నుంచి వేరు చేయడానికి వారే అనుమతిస్తారని 'సామ్నా' హెచ్చరించింది.

# మా నేతలు ప్రజా నాయకులు

**టీవీకే అధినేత విజయ్**



చెన్నై: నటుడి నుంచి రాజకీయ నేతగా మారిన, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ పుదుచ్చేరి ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. ప్రజలతో మమేకమై, వారిలో ఒకరిగా నిలబడే అభ్యర్థులనే తమ పార్టీ బరిలోకి దించిందని ఆయన స్పష్టం చేశారు. ఏప్రిల్ 9న 30 స్థానాలున్న పుదుచ్చేరి అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, ప్రచారానికి కేవలం నాలుగు రోజులే మిగిలి ఉండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. శనివారం తట్టన్‌చావడి మార్కెట్ ప్రాంతంలో జరిగిన బహిరంగ సభలో విజయ్ ప్రసంగించారు. ఈ సభకు భారీ సంఖ్యలో ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. అంతకుముందు ఆయన నిర్వహించిన రోడ్‌షోకు పోలీసులు నిర్దేశించిన సమయం కంటే ఎక్కువ సేపు కొనసాగినట్లు సమాచారం. తన పార్టీ పుదుచ్చేరిలో పోటీ చేయడం ఇదే మొదటిసారని గుర్తుచేసిన విజయ్, రాజకీయ నేపథ్యం చూసి కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజలతో సంబంధాలున్న వారికే టికెట్లు కేటాయించామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యర్థి కూటములపై విజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. డీఎంకే-కాంగ్రెస్ కూటమిని ఉద్దేశిస్తూ, కాంగ్రెస్ అనేకసార్లు, డీఎంకే మూడుసార్లు పుదుచ్చేరిని పాలించినప్పటికీ, ప్రస్తుత వారి కూటమి కేవలం పేరుకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. ఆ కూటమిలోని నేతలు ప్రజలనే కాకుండా సొంత నాయకత్వాన్నే మోసం చేశారని, ఇది హాస్యాస్పదంగా మారిందని ఆరోపించారు. అదే సమయంలో ఎన్ఆర్ కాంగ్రెస్-బీజేపీ కూటమిపైనా ఆయన విమర్శలు చేశారు. దీనిని బలహీనమైన, అవకాశవాద కూటమిగా అభివర్ణించారు. రాజకీయ ప్రయోజనాల కోసం వారు తన పార్టీ పేరును వాడుకుంటున్నారని ఆరోపణలు చేశారు. కేంద్రంలో వేర్వేరు సమయాల్లో అధికారంలో ఉన్నప్పటికీ, పుదుచ్చేరికి పూర్తిస్థాయి రాష్ట్ర హోదా కల్పించడంలో కాంగ్రెస్, బీజేపీ ఎందుకు విఫలమయ్యాయని ఆయన సూటిగా ప్రశ్నించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే, పుదుచ్చేరికి రాష్ట్ర హోదా సాధించడానికి 100 శాతం కృషి చేస్తామని ఆయన బలంగా హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం ఏర్పడితే వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని, ప్రభుత్వంలోని అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని విజయ్ వాగ్దానం చేశారు. ప్రతి కుటుంబానికి రూ. 25 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారు. ఈ ఎన్నికలు "మోసపూరిత కూటములకు", "ప్రజా ఆధారిత పాలనకు" మధ్య జరుగుతున్న పోరాటమని అభివర్ణించారు. ఈ రెండు ప్రధాన కూటములను తిరస్కరించి, తమ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. "పుదుచ్చేరికి సుపరిపాలన అవసరం. మాకు అవకాశం ఇవ్వండి, మీకు అండగా నిలుస్తాం" అని విజయ్ పిలుపునిచ్చారు.

# భారత్‌తో మాది వేల ఏళ్ల అనుబంధం

**భారత నౌకలకు ఢోకా లేదు:ఇరాన్**




టెహ్రాన్: ప్రస్తుతం హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం తలెత్తుతుంది. అయితే భారత్ నౌకలు మాత్రం జలసంధి గుండా ప్రయాణించడానికి ఇరాన్ అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలో 7వ ఎల్పీజీ ట్యాంకర్ జలసంధి గుండా భారత్ చేరుకుంది. ఈ సందర్భంగా భారత్ ధన్యవాదాలు తెలుపగా ఇరాన్ దానికి స్పందించింది. చమురు నౌక గుజరాత్ చేరుకున్న సందర్భంగా ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘ్వీ ఈ ట్యాంకర్ ప్రయాణాన్ని భారతీయ దౌత్య విజయంగా అభివర్ణించారు. దీనిపై ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ స్పందించింది. "భారతదేశం, ముఖ్యంగా గుజరాత్, మా ఉమ్మడి చరిత్రలో ఒక మధురమైన స్థానాన్ని కలిగి ఉన్నాయి. శతాబ్దాల క్రితం మా దేశం నుండి వచ్చిన వారిని మీరు సాదరంగా ఆహ్వానించారు. ఈ నాగరికత సంబంధాల ఆధారంగా, మన మధ్య స్నేహం మరియు సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి మేము కట్టుబడి ఉన్నాము." అని తెలిపింది. కాగా ఇరాన్ కాన్సులేట్ తన సందేశంలో సింధూ నాగరికతకు చెందిన లోథల్ ఓడరేవును ఉద్దేశించి మాట్లాడింది. సుమారు 4,000 ఏళ్ల క్రితమే సింధు లోయ నాగరికతకు మరియు పర్షియా తీరానికి మధ్య ఉన్న వాణిజ్య సంబంధాలను ఇది గుర్తుచేస్తుంది. కాగా గ్రీన్ సాన్వీ అనే నౌక 46,650 మెట్రిక్ టన్నుల గ్యాస్‌తో హర్మూజ్ జలసంధిని దాటింది. అయితే హర్మూజ్ జలసంధి విషయమై ఇప్పుడు యుద్ధం మరింత తీవ్రతరం అవుతున్న సంగతి తెలిసిందే. దానిని ఎట్టిపరిస్థితుల్లో తెరవాలని ట్రంప్ అల్టిమేటం జారీ చేస్తుండగా ఇరాన్ ససేమిరా అంటుంది. దీంతో ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాగా ఈ జలసంధి గుండా ప్రయాణించడానికి ఇరాన్ కేవలం 5 మిత్ర దేశాలకు భారతదేశం,రష్యా, చైనా, ఇరాక్,పాకిస్థాన్ అనుమతినిచ్చింది.

## 5 కేజీల సిలిండర్లకు అడ్రస్ ప్రూఫ్ అవసరం లేదు: కేంద్రం



న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఇకపై 5 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌ను అడ్రస్ ప్రూఫ్ అవసరం లేకుండా, కేవలం ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని శనివారం స్పష్టం చేసింది. సమీపంలోని ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల వద్ద ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇంధన సరఫరాపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని, అయితే దేశంలో పెట్రోల్, డీజిల్ లేదా ఎల్పీజీకి ఎలాంటి కొరత లేదని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ప్రజలు ఆందోళన చెంది ఇంధనాన్ని అధికంగా కొనుగోలు చేయవద్దని విజ్ఞప్తి చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రిటైల్ ఔట్‌లెట్లు సాధారణంగా పనిచేస్తున్నాయని, తగినన్ని నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. ముఖ్యంగా వలస కార్మికులు, స్థానిక చిరునామా పత్రాలు లేని వారిని దృష్టిలో ఉంచుకుని 5 కేజీల సిలిండర్ నిబంధనను సరళతరం చేసినట్లు అధికారులు వివరించారు. మార్చి 23 నుంచి ఇప్పటివరకు సుమారు 5.7 లక్షల సిలిండర్లను ఈ పద్ధతిలో విక్రయించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇంధన సరఫరాలో స్థిరత్వాన్ని కొనసాగించడానికి దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని పెంచామని, రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని కేంద్రం తెలిపింది. మరోవైపు, అక్రమ నిల్వలు, నల్ల బజారును అరికట్టేందుకు నిఘా పెంచామని, ఇటీవల 3,700కు పైగా దాడులు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన డిస్ట్రిబ్యూటర్లపై కఠిన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. నిత్యావసర వస్తువుల చట్టం కింద చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించినట్లు పేర్కొంది.

## ఇజ్రాయెల్ నౌకపై దాడి చేశాం

టెహ్రాన్: పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా అలుముకున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఇజ్రాయెల్‌కు చెందిన ఓ వాణిజ్య నౌకపై డ్రోన్‌తో దాడి చేసి ధ్వంసం చేశామని ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) శనివారం ప్రకటించింది. దీనికి ప్రతిగా టెహ్రాన్‌లోని కీలక సైనిక స్థావరాలపై వైమానిక దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) వెల్లడించింది. బహ్రెయిన్‌లోని ఖలీఫా బిన్ సల్మాన్ పోర్టులో ఉన్న 'ఎంఎస్ సీ ఇషికా' అనే వాణిజ్య నౌకను తమ శక్తివంతమైన ప్రక్షేపకాలతో లక్ష్యంగా చేసుకున్నామని ఐఆర్జీసీ నేవీ తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యాలపై చేపట్టిన దాడుల్లో ఇది 95వ వేవ్ అని పేర్కొంది. మరోవైపు, ఇజ్రాయెల్ సైన్యం టెహ్రాన్‌లోని పలు కీలక ప్రాంతాలపై విరుచుకుపడింది.



నిఘా సమాచారం ఆధారంగా ఇరాన్ క్షిపణి నిల్వ కేంద్రాలు, ఆయుధ పరిశోధన-అభివృద్ధి కేంద్రాలు, ఇతర సైనిక సదుపాయాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ దాడులపై ఇజ్రాయెల్ నుంచి తక్షణమే ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. ఇదిలా ఉండగా, ఇరాన్‌లోని ఖుజెస్థాన్ ప్రావిన్స్‌లో ఉన్న పలు పెట్రోకెమికల్ కంపెనీలపై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు జరిపినట్లు ఇరాన్ మీడియా తెలిపింది. ఈ ఘటనలో కనీసం ఐదుగురు గాయపడ్డారని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇటీవలే ఇరాన్ తమ గగనతలంలోకి ప్రవేశించిన రెండు అమెరికా ఎఫ్-15 యుద్ధ విమానాలను కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 28న ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీని అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేసి హతమార్చినప్పటి నుంచి ఈ దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు కొనసాగుతున్నాయి.

## లవ్లీ చిత్రం


శీతల్ అగర్వాల్

## నా కంటే ఐశ్వర్యారాయ్ గ్రేట్



బాలీవుడ్ స్టార్ కపుల్ అభిషేక్ బచ్చన్ - ఐశ్వర్యరాయ్ వివాహ బంధం పై ఏదో వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూనే ఉంటుంది. ఈనేపథ్యంలో తాజాగా ఓ మీట్ లో అభిషేక్ బచ్చన్ వైవాహిక జీవితంపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తమ ఇద్దరి మధ్య బంధం అనేది కేవలం భార్యాభర్తల సంబంధం మాత్రమే కాదని అదోక పరిపూర్ణమైన భాగస్వామ్యం అని అభిప్రాయపడ్డారు. తన తల్లి జయా బచ్చన్ పెళ్లి సమయానికి తండ్రి అమితాబ్ కంటే పెద్దస్టార్ అని గుర్తు చేసుకున్నారు. అందుకే ఇంట్లో పురుషుడే ఆధిపత్యం చలాయించాలనే ధోరణిలో తాను పెరగలేదని చెప్పారు. ఐశ్వర్యతో తన ప్రయాణం గురించి మాట్లాడుతూ, కెరీర్ ప్రారంభం నుండే ఆమె తనకు మంచి స్నేహితురాలని, ఆ స్నేహమే తమ మధ్య గౌరవాన్ని, అవగాహనను పెంచిందన్నారు. ఇద్దరి మధ్య కెరీర్ పరంగా ఎప్పుడూ పోటీ లేదని అభిషేక్ వెల్లడించారు. తనకంటే ఐశ్వర్య ఎక్కువ సక్సెస్ సాధించినా తాను ఎప్పుడూ అసూయ పడలేదన్నారు. అది తమ మధ్య ఉన్న ఆరోగ్యకరమైన అవగాహనకు నిదర్శనమన్నారు. ఒకరి గెలుపును మరొకరు సెలబ్రేట్ చేసుకోవడమే తమ బంధంలోని గొప్పతనమని వివరించారు. ఈ విషయంలో తమ మధ్య ఎప్పుడూ చర్చలు కూడా జరగవని అదంతా చాలా సహజంగా సాగిపోతుందన్నారు. అయినా నా కంటే ఐశ్వర్యా రాయ్ గొప్పదనే చెబుతానన్నారు.



## 29న బెల్లంకొండ పెళ్లి

టాలీవుడ్ లో మరో శుభవార్త చక్కర్లు కొడుతోంది. యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తన వ్యక్తిగత జీవితంలో కొత్త ఛాప్టర్ కు రెడీ అవుతున్నారు. ఆయన వివాహం గురించి గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలకు ఇప్పుడు స్పష్టత వచ్చింది. తాజాగా అందిన సమాచారం ప్రకారం.. ఆయన నిశ్చితార్థం ఈ నెల 5న తిరుమలలో జరగనుంది. తిరుమలలో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో సాయి శ్రీనివాస్ ఎంగేజ్మెంట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆధ్యాత్మిక వాతావరణంలో మొదలయ్యే ఆ వేడుకతో వివాహ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. నిశ్చితార్థం తర్వాత వివాహ వేడుకలు గ్రాండ్ నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. వివాహం ఈ నెల 29న హైదరాబాద్ లో జరగనుందట.

## 'వారణాసి' కోసం హైదరాబాద్‌కు ప్రియాంక

గ్లోబల్ స్టార్ ప్రియాంకా చోప్రా తిరిగి భాగ్యనగరంలో అడుగుపెట్టారు. సూపర్ స్టార్ మహేశ్‌బాబు, దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న భారీ అడ్వెంచర్ మూవీ 'వారణాసి' షూటింగ్‌లో పాల్గొనేందుకు ఆమె హైదరాబాద్ చేరుకున్నారు. ప్రయాణ సమయంలో కారులోనే ఫేస్ మాస్క్ వేసుకుని షూటింగ్‌కు సిద్ధమవుతున్న సెల్ఫీ వీడియోను ప్రియాంక సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అది కాస్తా నెట్టింట వైరల్‌గా మారింది. ఈ అప్‌డేట్‌తో మహేశ్ ఫ్యాన్స్‌లో జోష్ నెలకొంది. 'గుడ్ మార్నింగ్.. వర్క్‌కు వెళ్తున్నాను. స్కిన్ ప్రిపరేషన్ జరుగుతోంది' అంటూ మాస్క్ వేసుకున్న వీడియోను షేర్ చేశారు.



## అదరగొడుతున్న 'డెకాయిట్' ట్రైలర్

టాలీవుడ్ లో వైవిధ్యమైన థ్రిల్లర్ సినిమాలను తెరపైకి తీసుకు రావడంలో అడివి శేష్ స్టైలే వేరు. 'క్షణం' నుంచి 'మేజర్' వరకు అతను ఎంచుకునే కథలు ప్రేక్షకులను ఎప్పుడూ నిరాశపరచలేదు. ఇప్పుడు శనీల్ డియో దర్శకత్వంలో 'డెకాయిట్' అనే పవర్‌ఫుల్ సినిమాతో రానున్నాడు. లేటెస్ట్ గా విడుదలైన ఈ సినిమా ట్రైలర్ చూస్తుంటే, శేష్ తన బాక్సాఫీస్ సక్సెస్ ట్రాక్ ను కొనసాగించేలా కనిపిస్తున్నారు. ఈ ట్రైలర్ మొదలవ్వడమే ఒక అందమైన ప్రేమకథతో ప్రారంభమవుతుంది. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ మధ్య వచ్చే రొమాంటిక్ సీన్స్ సినిమాకు ఒక క్లాస్ టచ్ ఇచ్చాయి. ముఖ్యంగా "మనం పెళ్లి చేసుకుందామా?" అని మృణాల్ అడగటం, దానికి శేష్ సమాధానం చెప్పే విధానం ఆకట్టుకుంటుంది. అయితే, ఈ ప్రేమకథ ఒక్కసారిగా క్రైమ్ యాక్షన్ లోకి షిఫ్ట్అవ్వడం కొత్తగా ఉంది. తన జీవితం తనకు మళ్ళీ కావాలని ఒకరు, డబ్బు కోసం మరొకరు చేసే పోరాటమే ఈ సినిమా అసలు పాయింట్ అని ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. ముఖ్యంగా యాక్షన్ బ్లాక్స్ చాలా రిచ్ గా ఉన్నాయి. ముఖ్యంగా జైలు సీన్లు, పోలీస్ బస్సు పేలిపోవడం అడివి శేష్ మాస్ లుక్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచుతున్నాయి. "దుబాయ్ పోయే ముందు ఒక పని ఉండాది", "అందరూ మహేష్ బాబులు అయిపోదామనే!" లాంటి డైలాగ్స్ ఇంట్రెస్టింగ్ గా ఉన్నాయి.






## కంగనా 'క్వీన్' సీక్వెల్‌కు అడుగులు

బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన క్లాసిక్ చిత్రం క్వీన్. కంగనా రనౌత్ నటన, వికాస్ బహల్ దర్శకత్వ ప్రతిభ సినిమాను ఒక కల్ట్ ఫేవరెట్‌గా నిలబెట్టాయి. అయితే గత పదేళ్లుగా ఈ చిత్రానికి సీక్వెల్ వస్తుందనే ప్రచారం జరుగుతున్నప్పటికీ ఇంత వరకూ కార్యరూపం దాల్చలేదు. తాజాగా సినీ ప్రియులకు తీపి కబురు అందిస్తూ దర్శకుడు వికాస్ బహల్ ప్రతిష్టాత్మక సీక్వెల్ కోసం సన్నాహాలు మొదలుపెట్టారు. ఈసారి క్వీన్ సీక్వెల్ కథాంశం చాలా భిన్నంగా ఆసక్తికరంగా ఉండబోతోంది. మొదటి భాగంలో విదేశీ పర్యటన ద్వారా తనను తాను అన్వేషించుకున్న రాణి పాత్ర ఈ సీక్వెల్‌లో భారతదేశంలోని విభిన్న సంస్కృతులను, మెట్రో నగరాల జీవనశైలిని పరిచయం చేయబోతోంది. కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా, భారత్ వినువీధుల్లో రాణి చేసే ప్రయాణం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ముంబైతో పాటు దేశంలోని అన్ని ప్రధాన మెట్రో నగరాల్లో ఈ సినిమా షూటింగ్ ప్లాన్ చేస్తున్నారు. ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కతా వంటి నగరాల్లోని ఆధునిక జీవన విధానం, అక్కడి మహిళల ఎదుగుదల , రాణి ఎదుర్కొనే కొత్త సవాళ్లను ఈ కథలో చూపించబోతున్నారు.



## పెళ్లి చేసుకున్న షణ్ముఖ్

యూట్యూబ్ సెన్సేషన్, బిగ్ బాస్ రన్నరప్ షణ్ముఖ్ జస్వంత్ పెళ్లి పీటలెక్కాడు. గత కొద్దిరోజుల క్రితమే వైష్ణవి చోడిశెట్టితో నిశ్చితార్థం చేసుకుని అభిమానులకు సర్ప్రైజ్ ఇచ్చిన షన్ను, ఇప్పుడు సైలెంట్‌గా పెళ్లి కూడా కానిచ్చేశాడనే వార్త వైరల్ అవుతోంది. వీరి పెళ్లికి సంబంధించిన ఫోటోలు నెట్టింట హల్చల్ చేస్తున్నాయి. షణ్ముఖ్ జస్వంత్ కెరీర్ ప్రారంభంలో దీప్తి సునైనాతో ఉన్న రిలేషన్ అందరికీ తెలిసిందే. వీరిద్దరూ విడిపోతున్నట్టు ప్రకటించినప్పుడు అభిమానులు ఎంతో బాధపడ్డారు. బిగ్ బాస్ తర్వాత వచ్చిన మనస్పర్థల వల్ల వీరి బంధం ముగిసిందని సోషల్ మీడియాలో పెద్ద చర్చే జరిగింది. చాలా కాలం పాటు షన్ను మళ్ళీ దీప్తితో కలుస్తాడని ఫ్యాన్స్ ఆశపడ్డారు, కానీ షణ్ముఖ్ తన లైఫ్‌లో ముందుకు సాగిపోయాడు. వైష్ణవితో ఎంగేజ్మెంట్ చేసుకుని అందరికీ పెద్ద ట్విస్ట్ ఇచ్చాడు. ప్రస్తుతం వైష్ణవితో పెళ్లి జరిగిపోయిందనే వార్తలతో, దీప్తితో ఉన్న పాత అధ్యాయానికి పూర్తిగా తెరపడినట్లయింది. ఇద్దరూ తమ తమ కెరీర్‌లపై ఫోకస్ పెట్టి లైఫ్‌లో సెటిల్ అయ్యారు.

## మద్యపానం ఒక ఆరోగ్య సమస్య



మద్యపాన వ్యసనం మానసిక ఆరోగ్యంపై బాలీవుడ్ నటి జాన్వీకపూర్ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి. మద్యపానానికి బానిసవ్వడం అనేది ఒక వ్యక్తి నైతిక పతనం కాదని దానిని ఒక తీవ్రమైన ఆరోగ్య సమస్యగా చూడాలని ఆమె అభిప్రాయపడ్డారు. వ్యసనపరులను సమాజం చూసే కోణంలో మార్పు రావాలని జాన్వీ కోరింది. -ఎవరైనా మద్యానికి బానిసైనంత మాత్రాన వారి వ్యక్తిత్వాన్ని లేదా క్యారెక్టర్‌ను తక్కువ చేసి అంచనా వేయలేమంది. వ్యసనం అనేది ఒక వ్యక్తి ఎంచుకునే విలాసం కాదు.. అది ఒక మానసిక శారీరక రుగ్మత అని తెలిపింది. సమాజం వారిని నేరస్థుల్లా కాకుండా.. చికిత్స అవసరమైన రోగుల్లా గుర్తించాలని పేర్కొంది. చాలా మంది మానసిక ఒత్తిడి, ఆందోళన లేదా ఇతర వ్యక్తిగత కారణాల వల్ల తెలియకుండానే వ్యసనాల వైపు మళ్లుతుంటారని వివరించింది.





# రాజస్థాన్ థ్రిల్లింగ్ విక్టరీ

## గుజరాత్ జస్ట మిస్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో మరో హోరాహోరీ మ్యాచ్ అభిమానులను అలరించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 6 పరుగుల స్వల్ప తేడాతో విజయం సాధించింది. భారీ లక్ష్య ఛేదనలో గుజరాత్ చివరి వరకు పోరాడినా, కీలక సమయంలో వికెట్లు కోల్పోయి ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 210 పరుగుల భారీ స్కోరు చేసింది. వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ (42 బంతుల్లో 75 పరుగులు; 5 ఫోర్లు, 5 సిక్సులు) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చెలరేగగా, యశస్వి జైస్వాల్ (36 బంతుల్లో 55) హాఫ్ సెంచరీతో రాణించాడు. వీరిద్దరి మెరుపులతో రాజస్థాన్ పటిష్ట స్థితిలో నిలిచింది. గుజరాత్ బౌలర్లలో కగిసో రబాడ రెండు వికెట్లు తీశాడు. అనంతరం 211 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్‌కు సాయి సుదర్శన్ (44 బంతుల్లో 73 పరుగులు; 9 ఫోర్లు, 3 సిక్సులు) అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చాడు. అతను క్రీజులో ఉన్నంతసేపు గుజరాత్ విజయం ఖాయమనిపించింది. అయితే, కీలక సమయంలో రాజస్థాన్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ తన మాయాజాలంతో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. అతను ఒకే ఓవర్లో కీలక వికెట్లు పడగొట్టడంతో సహా మొత్తం నాలుగు వికెట్లతో గుజరాత్ మిడిలార్డర్‌ను దెబ్బతీశాడు. చివర్లో రషీద్ ఖాన్ (24), రబాడ (23 నాటౌట్) పోరాడినా, జట్టును గెలిపించలేకపోయారు. ఆఖరి ఓవర్లో విజయానికి 11 పరుగులు అవసరం కాగా, 4 పరుగులే లభించాయి. చివరికి గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 204 పరుగులకే పరిమితమైంది.

### బాల్ స్పీడ్.. 154.2 కిలోమీటర్లు

ఐపీఎల్ 2026 సీజన్‌లో యువ కెరటం అశోక్ శర్మ సంచలనం సృష్టించాడు. గుజరాత్ టైటాన్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న 23 ఏళ్ల పేసర్, ఈ సీజన్‌లోనే అత్యంత వేగవంతమైన బంతిని విసిరి రికార్డు నెలకొల్పాడు. అహ్మదాబాద్ వేదికగా శనివారం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 154.2 కిలోమీటర్ల వేగంతో బంతిని సంధించి అందరి దృష్టినీ ఆకర్షించాడు. ఈ అద్భుతమైన డెలివరీతో, ఈ సీజన్‌లో ఫాస్టెస్ట్ బాల్ వేసిన ఆన్రిచ్ నోర్కియా రికార్డును అతను బద్దలు కొట్టాడు.







# ముంబై బౌలర్లకు సమీర్ రిజ్వీ చుక్కలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఘనవిజయం

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. యువ సంచలనం సమీర్ రిజ్వీ (90; 51 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్సులు) మరోసారి ఆకాశమే హద్దుగా చెలరేగడంతో, ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 6 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. సమీర్ రిజ్వీ ఆడిన విధ్వంసక ఇన్నింగ్స్ ముందు ముంబై నిర్దేశించిన లక్ష్యం చిన్నబోయింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఢిల్లీ, కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ముంబైని 162 పరుగులకే పరిమితం చేసింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (51), రోహిత్ శర్మ (35) రాణించినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ఢిల్లీ బౌలర్లలో ముఖేష్ కుమార్ రెండు వికెట్లు తీయగా, అక్షర్ పటేల్, ఎంగిడి, నటరాజన్ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం 163 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీకి ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. కేఎల్ రాహుల్ (1), నితీశ్ రాణా (0) వికెట్లను త్వరగా కోల్పోయి



కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన సమీర్ రిజ్వీ, మరో ఓపెనర్ పాతుమ్ నిస్సంక (44)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. నిస్సంక ఔటయ్యాక అసలు విధ్వంసం మొదలుపెట్టాడు. ముంబై బౌలర్లపై ఎదురుదాడికి దిగి బౌండరీలు, సిక్సర్లతో హోరెత్తించాడు. తన అద్భుతమైన బ్యాటింగ్‌తో ఒంటిచేత్తో మ్యాచ్‌ను ఢిల్లీ వైపు తిప్పేశాడు. ఏప్రిల్ 1న లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ సమీర్ రిజ్వీ చిచ్చరపిడుగులా ఆడాడు. ఆ మ్యాచ్‌లో 47 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సులతో అజేయంగా 70 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇవాళ కూడా అదే తరహా ఇన్నింగ్స్‌తో చేజింగ్‌లో అదరగొట్టి, తానెంత విలువైన ఆటగాడో మరోసారి నిరూపించుకున్నాడు. సమీర్ విజృంభణకు డేవిడ్ మిల్లర్ (21 నాటౌట్) తోడవడంతో ఢిల్లీ 18.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి విజయాన్ని అందుకుంది.



# స్వదేశానికి కమిన్స్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. జట్టు రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ టోర్నీ మధ్యలోనే ఆస్ట్రేలియాకు తిరిగి వెళ్లాడు. కొంతకాలంగా వేధిస్తున్న వెన్నునొప్పికి సంబంధించి చివరి వైద్య స్కాన్ కోసం అతడు స్వదేశానికి పయనమయ్యాడు. దీంతో రాబోయే మరికొన్ని మ్యాచ్‌లకు కమిన్స్ దూరం కానున్నాడు. వివరాల్లోకి వెళితే, కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో గురువారం (ఏప్రిల్ 2) కోల్‌కతా నైట్ రైడర్స్‌పై సన్‌రైజర్స్ విజయం సాధించిన వెంటనే కమిన్స్ ఆస్ట్రేలియాకు బయల్దేరాడు. ఈ స్కాన్‌ను ముందుగానే ప్లాన్ చేసినట్లు, క్రికెట్ ఆస్ట్రేలియా పర్యవేక్షణలో ఇది జరగనున్నట్లు తెలిసింది. స్కాన్ పూర్తయిన తర్వాత ఏప్రిల్ 17న అతడు తిరిగి సన్‌రైజర్స్ జట్టుతో చేరే అవకాశం ఉంది. ఈ లెక్కన కమిన్స్ మరో రెండు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడు. గత యాషెస్ సిరీస్ తర్వాత కమిన్స్ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌నకు కూడా దూరమయ్యాడు. ఐపీఎల్ ఆరంభంలోనే, కమిన్స్ ఆడలేదని స్పష్టం కావడంతో సన్‌రైజర్స్ యాజమాన్యం ఇషాన్ కిషన్‌ను కెప్టెన్‌గా నియమించింది. కమిన్స్ గైర్హాజరీలో మరికొన్ని మ్యాచ్ ల పాటు ఇషాన్ కిషనే జట్టును నడిపించనున్నాడు. ఇషాన్ కెప్టెన్సీలో సన్‌రైజర్స్ ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన తొలి మ్యాచ్‌లో ఓడినా, రెండో మ్యాచ్‌లో కోల్‌కతాపై 65 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి తిరిగి పుంజుకుంది. ప్రస్తుతం రెండు పాయింట్లతో పట్టికలో ఆరో స్థానంలో ఉంది. సన్‌రైజర్స్ తమ తదుపరి మ్యాచ్‌ను ఆదివారం లక్నో సూపర్ జెయింట్స్ తో హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియంలో ఆడనుంది. ఇది ఈ సీజన్‌లో హైదరాబాద్‌కు తొలి హోమ్ మ్యాచ్ కావడం విశేషం.

# నా కంటే వైభవ్ బ్యాట్ స్పీడ్ ఎక్కువ: యువీ

భారత క్రికెట్ జట్టు మాజీ ఆల్-రౌండర్, ప్రపంచకప్ హీరో యువరాజ్ సింగ్.. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై ప్రశంసల వర్షం కురిపించాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే అద్భుతమైన బ్యాటింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న వైభవ్, త్వరలోనే టీమిండియాకు ఆడటం ఖాయమని జోస్యం చెప్పాడు. ముఖ్యంగా వైభవ్ బ్యాట్ స్పీడ్ తనకంటే మెరుగ్గా ఉందని యువీ చెప్పాడు. 2025 ఐపీఎల్ వేలంలో 13 ఏళ్ల వయసులోనే రాజస్థాన్ రాయల్స్ జట్టు వైభవ్‌ను రూ.1.1 కోట్లకు కొనుగోలు చేయడంతో అతను ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాడు. గతేడాది ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్, ఆడిన తొలి బంతినే సిక్సర్‌గా మలిచి తన రాకను ఘనంగా చాటాడు. ఆ తర్వాత తన రెండో ఐపీఎల్ మ్యాచ్‌లోనే కేవలం 35 బంతుల్లో సెంచరీ బాది, ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత వేగంగా శతకం సాధించిన భారత బ్యాటర్‌గా, అత్యంత పిన్న వయస్కుడైన సెంచూరియన్‌గా రికార్డులు సృష్టించాడు. ఓ క్రీడా ఛానెల్‌తో మాట్లాడుతూ యువరాజ్ సింగ్.. వైభవ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ప్రస్తుతం టీ20 క్రికెట్‌లో వస్తున్న కొత్త ఆటగాళ్లను చూడండి. వైభవ్ సూర్యవంశీ అద్భుతంగా రాణిస్తున్నాడు. అతని బ్యాట్ స్పీడ్ నమ్మశక్యంగా లేదు. నా కంటే



అతని బ్యాట్ స్పీడ్ బాగుంది. అంత స్పీడ్ ఉన్న ఆటగాళ్లను నేను చాలా అరుదుగా చూశాను' అని యువీ కొనియాడాడు. మైదానం నలువైపులా షాట్లు ఆడగల నైపుణ్యం అతని సొంతమని వివరించాడు. 'చిన్న వయసులోనే అతనిలో ఎన్నో నైపుణ్యాలు ఉన్నాయి. వైఫల్యాలు, విజయాల నుంచి నేర్చుకుంటూ అతను మరిన్ని మ్యాచ్‌లు ఆడితే మరింత మెరుగైన బ్యాటర్‌గా ఎదుగుతాడు' అని యువీ అన్నాడు.

## నేనేమైనా ఓవర్సీస్ ప్లేయర్‌నా?: కోహ్లీ



కోహ్లీ తన భార్య అనుష్క శర్మ, పిల్లలతో కలిసి ఎక్కువ సమయం లండన్‌లో గడుపుతుండటంతో.. అతడిని ఆర్సీబీ తరఫున ఆడుతున్న ఐదో 'ఓవర్సీస్ ప్లేయర్' అంటూ సోషల్ మీడియాలో అభిమానులు సరదాగా జోకులు వేస్తున్నారు. ఈ విషయంపై ఆర్సీబీ తమ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఓ వీడియోలో మిస్టర్ నాగ్స్, కోహ్లీని ప్రశ్నించాడు. "ఈ సీజన్‌లో ఆర్సీబీ ఐదుగురు ఓవర్సీస్ ప్లేయర్లతో ఆడుతోందనే జోక్‌పై మీరేమంటారు?" అని మిస్టర్ నాగ్స్ అడగ్గా.. కోహ్లీ ఒక్కసారిగా నవ్వేశాడు. "నన్ను ఎందుకు అడుగుతున్నారు? ఆ విషయం ఓవర్సీస్ ప్లేయర్లను అడగండి. నేను ఓవర్సీస్ ప్లేయర్‌ని కాదు" అని ఫన్నీగా బదులిచ్చాడు. ఆ తర్వాత, "నేను ఓవర్సీస్ ప్లేయర్‌లా కనిపిస్తున్నానా?" అని ఎదురు ప్రశ్నించగా, లేదని హోస్ట్ సమాధానమిచ్చాడు. ఈ సరదా సంభాషణకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



# శ్రేయస్‌కు 24 లక్షల ఫైన్

ఐపీఎల్‌లో భాగంగా శుక్రవారం చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు అయిదు వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసింది. ఆ మ్యాచ్‌లో పంజాబ్ కెప్టెన్ అద్భుతమైన హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. అయితే ఈ మ్యాచ్‌లో పంజాబ్ జట్టు స్లో ఓవర్ రేట్‌కు పాల్పడింది. దీంతో పంజాబ్ కెప్టెన్ అయ్యర్‌కు జరిమానా విధించారు. 24 లక్షల ఫైన్ విధిస్తున్నట్లు ఐపీఎల్ పేర్కొన్నది. ఈ సీజన్‌లో రెండోసారి పంజాబ్ జట్టు ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు పాల్పడింది. ఐపీఎల్‌లోని ఆర్టికల్ 2.22 ప్రకారం పంజాబ్ కింగ్స్ తప్పిదం చేసినట్లు ఐపీఎల్ పేర్కొన్నది. తన తొలి మ్యాచ్‌లో కూడా పంజాబ్ జట్టుకు స్లో ఓవర్ రేట్ కింద ఫైన్ పడింది. ఫస్ట్ మ్యాచ్‌లో శ్రేయాస్ అయ్యర్‌కు 12 లక్షల జరిమానా విధించారు. ఇప్పుడు ఆ ఫైన్‌ను రెట్టింపు చేసి 24 లక్షల జరిమానా వేశారు. ఐపీఎల్ మీడియా అడ్వైజరీ ఓ ప్రకటనలో ఈ విషయాన్ని చెప్పింది. రెండో సారి తప్పు చేయడం వల్ల పంజాబ్ జట్టు మొత్తానికి ఫైన్ వేశారు. ఇంపాక్ట్ ప్లేయర్‌తో పాటు ఆటగాళు అందరిపై ఆరు లక్షలు లేదా మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించనున్నారు.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
ఆదివారం 5-4-2026, జగిత్యాల

నేటి ఈవార్తలు
సంపాదకీయం Editorial

## శాంతి దూత.. యుద్ధాల ప్రదాత

డొనాల్డ్ ట్రంప్ తన హయాంలో అబ్రహం ఒప్పందాలు వంటివి కుదుర్చుకుని, తాను 'శాంతి దూత'నని, తనకు నోబెల్ శాంతి బహుమతి దక్కాలని పదేపదే చెప్పుకుంటూ ఉంటారు. కానీ ఆయన అనుసరిస్తున్న విదేశాంగ విధానాలు, తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచాన్ని శాంతి వైపు కాక, అనిశ్చితి మరియు యుద్ధ మేఘాల వైపు నడిపిస్తున్నాయనేది చేదు నిజం. ఒకవైపు నోబెల్ బహుమతిపై ఆశలు పెంచుకుంటూనే, మరోవైపు అంతర్జాతీయ ఒప్పందాల నుండి వైదొలగడం, మిత్రదేశాలతో సైతం విభేదించడం ట్రంప్ నైజం. ముఖ్యంగా ఇరాన్ అణు ఒప్పందం నుంచి వైదొలగడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను పెంచడం వంటి చర్యలు ఆయన శాంతి కాముకతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఆయన వాక్చాతుర్యం అంతా అమెరికా ఫస్ట్ అనే నినాదం చుట్టూ తిరుగుతూ, మిగిలిన ప్రపంచ దేశాల మధ్య అగాధాన్ని పెంచుతోంది. ట్రంప్ హయాంలో తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలు రష్యా, చైనా వంటి అగ్రరాజ్యాలతో సంబంధాలను మరింత క్షీణింపజేశాయి. వాణిజ్య యుద్ధాలు మొదలుకొని, సైనిక మోహరింపుల వరకు ఆయన అడుగులు ప్రపంచ శాంతికి విఘాతం కలిగించేవే. నోబెల్ శాంతి బహుమతి అనేది దేశాల మధ్య మైత్రిని పెంచేవారికి దక్కుతుంది, కానీ ట్రంప్ తీరు మాత్రం విద్వేషాలను, విభజనను ప్రోత్సహించేలా ఉంది. నోబెల్ శాంతి బహుమతి కోరుకునే వ్యక్తి, ప్రపంచాన్ని యుద్ధం వైపు కాకుండా సుస్థిరత వైపు నడిపించాలి. కానీ, యుద్ధాలు మొదలుపెట్టిన చరిత్ర ట్రంప్‌ది. ప్రపంచ దేశాలను 3వ ప్రపంచ యుద్ధం వైపు నడిపిస్తోంది ట్రంప్.

# సమతుల్య విదేశాంగం

**ప్రస్తుత అంతర్జాతీయ రాజకీయ యవనికపై భారత్ ఒక విశ్వమిత్రగా అవతరించింది. ముఖ్యంగా పశ్చిమాసియాలో అగ్రరాజ్యం అమెరికాకు, ఇంధన వనరుల నిలయమైన ఇరాన్‌కు మధ్య యుద్ధం నడుస్తున్న ఈ తరుణంలో.. భారత్ ప్రదర్శిస్తున్న పరిణతి చెందిన విదేశాంగ విధానం ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత్ అనుసరిస్తున్న ఈ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి అద్భుతమైన ఫలితాలను ఇస్తోంది. ఒకవైపు అమెరికా మనకు రక్షణ, సాంకేతిక రంగాల్లో అత్యంత సన్నిహిత భాగస్వామి. మరోవైపు ఇరాన్‌తో మనకు చారిత్రక, సాంస్కృతిక సంబంధాలతో పాటు చమురు అవసరాలు, చాబహార్ వంటి కీలక ప్రాజెక్టుల బంధం ఉంది. ఈ రెండింటి మధ్య ఎవరికీ దూరం కాకుండా, తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకుంటూనే శాంతిని కాంక్షించడం మోదీ విదేశాంగ విధానంలోని గొప్పతనం. ఉక్రెయిన్ సంక్షోభం సమయంలో మోదీ చెప్పిన 'ఇది యుద్ధాల యుగం కాదు' అన్న నినాదం నేడు ఇరాన్-అమెరికా యుద్ధానికీ వర్తిస్తుంది.**



అలేఖ్య బొమ్మకంటి



భావోద్వేగాలకు లోనుకాకుండా, చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని భారత్ నొక్కి చెబుతోంది. అమెరికాతో కౌంటర్ కోఆర్డినేషన్ చేస్తూనే, ఇరాన్‌తో నేరుగా సంప్రదింపులు జరపడం ద్వారా భారత్ ఒక విశ్వసనీయ మధ్యవర్తిగా తన స్థానాన్ని పదిలం చేసుకుంది. మోదీ విదేశాంగ విధానంలో ప్రధానంగా మూడు అంశాలు కనిపిస్తాయి. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల చమురు ధరలు పెరిగి భారత ఆర్థిక వ్యవస్థపై భారం పడుతుంది. అందుకే ఉద్రిక్తతలు తగ్గించడమే భారత్ లక్ష్యం. గల్ఫ్ దేశాల్లో ఉన్న లక్షల మంది భారతీయుల క్షేమం దృష్ట్యా ప్రాంతీయ స్థిరత్వం మనకు కీలకం. అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గకుండా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నట్లే, ఇరాన్ విషయంలో కూడా భారత్ తన స్వతంత్ర వైఖరిని చాటుకుంది. ప్రపంచ వేదికలపై భారత్ మాటను నేడు అగ్రరాజ్యాలు సైతం గౌరవిస్తున్నాయి. ఏ పక్షానికీ లొంగకుండా, కేవలం న్యాయం, శాంతి వైపు నిలబడటం మోదీ దౌత్యానికి నిదర్శనం. ఇరాన్-అమెరికా ఉద్రిక్తతల సుడిగుండంలో భారత్ ఒక స్థిరమైన నౌకలా సాగుతోంది. ఇది కేవలం ఒక దేశానికో, వ్యక్తికో చెందిన విజయం కాదు; ఇది మారుతున్న ప్రపంచ క్రమంలో భారత్ పొందుతున్న గౌరవప్రదమైన స్థానం. ప్రధాని మోదీ దార్శనికత, విదేశాంగ శాఖ సమన్వయం భారత్‌ను ప్రపంచశాంతికి చిరునామాగా మార్చాయి. యుద్ధం ఎవరికీ మేలు చేయదని చాటుతూనే, తన ప్రయోజనాలను కాపాడుకోవడంలో భారత్ అనుసరిస్తున్న వైఖరి నిజంగా అమోఘం.

అంతర్జాతీయ రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరు.. శాశ్వత ప్రయోజనాలు మాత్రమే ఉంటాయి అన్న నానుడికి సజీవ సాక్ష్యం నేటి భారత విదేశాంగ విధానం. ముఖ్యంగా ఇరాన్ వంటి సంక్లిష్ట దేశంతో సత్సంబంధాలు కొనసాగిస్తూనే, అమెరికా వంటి అగ్రరాజ్యాల ఆంక్షల ఒత్తిడిని తట్టుకొని, భారత్‌కు చమురును రప్పించుకోవడంలో మోదీ ప్రభుత్వం ప్రదర్శిస్తున్న చొరవ అమోఘం. ప్రపంచ చమురు వాణిజ్యంలో ఐదో వంతు ప్రవహించే హర్మూజ్ జలసంధి నేడు అంతర్జాతీయ రాజకీయాలకు అగ్నిగుండంగా మారింది. ఇరాన్, పశ్చిమ దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన ప్రతిసారీ ఈ మార్గం మూతబడుతుందనే ఆందోళన ప్రపంచాన్ని వణికిస్తుంది. కానీ, ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ఇరాన్‌తో సయోధ్యను కాపాడుకుంటూ, మన ఇంధన నౌకలకు ఏ ఆటంకం కలగకుండా చూసుకోవడంలో మోదీ ప్రభుత్వం సాధించిన విజయం ఒక దౌత్య అద్భుతం. భారతదేశానికి వచ్చే చమురులో దాదాపు 60 శాతం ఈ జలసంధి గుండానే ప్రయాణిస్తుంది. ఇక్కడ చిన్నపాటి ఉద్రిక్తత తలెత్తినా భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ సున్నితమైన అంశాన్ని గుర్తించిన మోదీ ప్రభుత్వం, ఇరాన్‌తో సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తూనే, ఆ దేశం ఈ మార్గాన్ని భారత్ కోసం ఎల్లప్పుడూ తెరిచి ఉంచేలా దౌత్యపరమైన హామీలను పొందింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగినప్పుడు, భారత నౌకాదళం 'ఆపరేషన్ సంకల్ప్' పేరుతో హర్మూజ్ జలసంధి ప్రాంతంలో తన యుద్ధ నౌకలను మోహరించింది. ఇది ఎవరినో భయపెట్టడానికి కాదు, మన వాణిజ్య నౌకలకు రక్షణ కల్పించడానికి. ఇరాన్ తీరానికి అతి సమీపంలో భారత నౌకాదళం కార్యకలాపాలు సాగిస్తున్నా, ఇరాన్‌తో ఉన్న సత్సంబంధాల వల్ల ఎటువంటి ఘర్షణలు తలెత్తకపోవడం మోదీ ప్రభుత్వ విదేశాంగ నీతికి నిదర్శనం. ఇతర దేశాలకు ఇరాన్ సవాలుగా మారవచ్చు కానీ, భారత్‌కు అది ఒక వ్యూహాత్మక భాగస్వామి. మోదీ ప్రభుత్వం ఇరాన్‌తో కేవలం చమురు కోసమే కాకుండా, చాబహా ఓడరేవు వంటి భారీ ప్రాజెక్టుల ద్వారా బలమైన బంధాన్ని నిర్మించుకుంది. ఈ స్నేహం వల్లనే, హర్మూజ్ జలసంధిలో ఇతర దేశాల నౌకలు తనిఖీలకు లేదా ఇబ్బందులకు గురైనా, భారత నౌకలు మాత్రం సురక్షితంగా సాగిపోతున్నాయి. ఇరాన్-అమెరికా మధ్య డ్రోన్ దాడులు, క్షిపణి దాడులు జరిగిన సందర్భాల్లో కూడా భారత్ తన చమురు సరఫరా గొలుసు దెబ్బతినకుండా చూసుకోగలిగింది. అటు అమెరికాతో రక్షణ ఒప్పందాలు చేసుకుంటూనే, ఇటు ఇరాన్ భౌగోళిక రాజకీయ ప్రాధాన్యతను గౌరవించడం మోదీ ప్రభుత్వ సమతుల్య విధానం వల్లనే సాధ్యమైంది. హర్మూజ్ వంటి మార్గాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తూనే, ఉన్న మార్గాలను సురక్షితం చేసుకోవడం మోదీ వ్యూహం. ఒకవైపు రష్యా నుంచి చమురు దిగుమతులు పెంచుతూనే, మరోవైపు ఇరాన్ మార్గాన్ని కాపాడుకోవడం ద్వారా భారత్ తన ఇంధన భద్రతను పటిష్టం చేసుకుంది. హర్మూజ్ జలసంధి గుండా భారత్‌కు చమురును రప్పించుకోవడం అనేది కేవలం రవాణా వ్యవహారం కాదు; అది ఒక దేశం సార్వభౌమాధికారం, దౌత్య శక్తికి పరీక్ష. ఈ పరీక్షలో మోదీ ప్రభుత్వం నూటికి నూరు శాతం విజయం సాధించింది. ఇరాన్‌తో సయోధ్యను ఆయుధంగా మలుచుకుని, సముద్ర గర్భంలోని సంక్షోభాలను దాటుకుంటూ దేశ ఆర్థిక చక్రం ఆగకుండా చూస్తున్న తీరు నిజంగా అమోఘం. ఇది నవ భారత శక్తికి ప్రతిరూపం.





## విజయ్ సాహసోపేత నిర్ణయం

తమిళనాడులో రాజకీయంగా వేళ్లూనుకున్న డీఎంకే, అన్నాడీఎంకే వంటి బలమైన శక్తులను ఎదుర్కోవడానికి పొత్తులు అనివార్యమని భావించే తరుణంలో, విజయ్ ఒంటరిగా వెళ్లాలని నిర్ణయించుకోవడం ఆయన ఆత్మవిశ్వాసానికి నిదర్శనం. ఇది ఎన్నికల వ్యూహం మాత్రమే కాదు, పాత రాజకీయ శకానికి స్వస్తి పలికి ఒక కొత్త ప్రత్యామ్నాయాన్ని ప్రజల ముందు ఉంచాలనే సంకల్పంగా కనిపిస్తోంది. విజయ్ ఈ ఎన్నికల్లో పెరంబూర్, తిరుచిరాపల్లి ఈస్ట్ అనే రెండు స్థానాల నుంచి పోటీ చేస్తున్నారు. తన పట్ల ఉన్న ప్రజాదరణను ఓట్లుగా మార్చుకోవడమే కాకుండా, పార్టీ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు అనిపిస్తోంది. విజయ్ తన ప్రసంగాల్లో ప్రస్తుత పాలక పక్షమైన డీఎంకేను ఒక దుష్ట శక్తిగా అభివర్ణిస్తున్నారు. శాంతిభద్రతల విఫల్యం, కుటుంబ పాలన వంటి అంశాలను ప్రధాన అజెండాగా మార్చుకుని, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌పై నేరుగా విమర్శలు గుప్పిస్తున్నారు. అవినీతి రహిత పాలనను అందించడమే తన లక్ష్యమని చాటిచెబుతున్నారు. భారీ అభిమాన గణం ఉండటం ఒక ఎత్తు అయితే, దానిని క్షేత్రస్థాయిలో బలమైన రాజకీయ యంత్రాంగంగా మార్చడం విజయ్‌కు అతిపెద్ద సవాలు. తమిళనాడు ప్రజలు సినిమా స్టార్లను రాజకీయాల్లో ఆదరించడం కొత్తేమీ కాదు. అయితే, ఎంజీఆర్ లేదా జయలలిత తరహాలో విజయ్ కూడా ఒక రాజకీయ ప్రభంజనాన్ని సృష్టించగలరా అన్నది వేచి చూడాలి. ఏప్రిల్ 23న జరగనున్న ఈ ఎన్నికలు విజయ్ రాజకీయ భవిష్యత్తును మాత్రమే కాకుండా, తమిళనాడు రాజకీయ దిశను కూడా నిర్ణయిస్తాయి.

**- శ్రీనాథ్ కొండపల్లి, సోషల్ యాక్టివిస్ట్, తిరుపతి**

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by BOMMAKANTI SHRAVAN KUMAR from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by BOMMAKANTI SHRAVAN KUMAR and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.